honeybee.org
Vol-7 Issue-4

సంపుటి 7 సంచిక 4 మే - జూన్ 2019

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక









# తెలియనిదాని గురించిన భయం




ఒకసారి ఓ విద్యార్థి 'జైన్' మతగురువు వద్దకు వెళ్ళి "తనని శిష్యునిగా స్వీకరించ"మని కోరాడు. దానికా గురువుగారు "నువ్వు ముందొక పరీక్షలో నెగ్గితే నిన్ను నా శిష్యునిగా స్వీకరిస్తాను" అన్నాడు. ఆయన విద్యార్థికి ఒక తలుపును చూపించి "దీనివెనక చీకటి గది ఉంది. దాని నిండా ద్రాక్షరసం పోసిన సీసాలున్నాయి. నువ్వా గదిలోని ఒక్క సీసా కూడా పగలకుండా ఒక్క చుక్క ద్రాక్షరసం కూడా క్రిందకు పోకుండా ఆవలివైపున వున్న తలుపు గుండా బయటికి వస్తే నిన్ను నా శిష్యుడిగా స్వీకరిస్తాను" అన్నాడు. విద్యార్థి తలుపు తీసుకుని చీకటి గదిలో ప్రవేశించి చాలా సమయం తర్వాత అవతలి వైవున్న తలుపులోనుంచి బయటకు వచ్చాడు. గురువుగారు అతడ్ని శిష్యునిగా స్వీకరించాడు.

ఆయన శిష్యుడితో "ఇప్పుడు నువ్వు నా మొదటి పాఠానికి సిద్ధంగా వున్నావు" అని చెప్పి గదిలోపలికి తీసుకువెళ్ళి దీపం వెలిగించాడు. గదంతా ఖాళీగా వుంది. గురువు శిష్యుడితో "ఇంతవరకు నీ జీవితాన్ని ఇలాగే గడిపావు" అన్నాడు.

**మనమింతవరకు చూడని వాటిని గురించి చిత్ర విచిత్రంగా ఊహించుకొని, లేనివాటిని ఉన్నాయని భ్రమపడి భయంతో గడిపామా? ఎదురుగుండా ఏ అడ్డంకీ లేని మార్గం వున్నా, మనమేమీ చేయకుండా మన స్తబ్దతని సమర్థించుకుంటున్నాం. బహుశా కొత్త విషయాలు కనుగొనే వాళ్ళకి ఇలాంటి పిచ్చి ఆచలోచనలు, భ్రమలు ఉండవేమో....!**

**– హనీబీ 19(3) – 2008**

Vol-7, Issue - 4 May-June 2019

# విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-7 సంచిక - 4 మే-జూన్ 2019

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘువ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-
for 5 years Subscription**



3 ఇద్దరు స్నేహితుల సృజనాత్మకత


7 పోర్టబుల్ వాటర్ పంప్


10 ప్రకృతితో మమేకమై 'తొలకరి'ని ప్రారంభించండి


12 గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు


18 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు


22 మొబైల్ పంచర్ షాప్


26 గుజరాత్ రాష్ట్రం నుండి సేకరించిన పల్లె కబుర్లు


29 జ్ఞానయజ్ఞం


30 'బొప్పాయి' పరమ ఔషధము


32 స్పందన

కవర్ లోపలి పేజీల్లో... **తెలియనిదాని గురించిన భయం** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **'తెలంగాణ ఇన్నోవేషన్ల ఉత్సవం'లో పల్లెసృజన వెలుగులు**


Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

## సంపాదకీయం

# ఇన్నోవేటర్లను వెతికి వెలికి తీయడం మనందరి బాధ్యత

సామాన్య ప్రజల్లో అసామాన్య జ్ఞానం, సరియైన ప్రజ్ఞ, సమస్యల పరిష్కారాలకై తపన ఉందని 14 సంవత్సరాల 'పల్లెసృజన' పయనంలో రుజువైంది. ఈ ఆనందాన్ని మీ అందరితో 'పల్లెసృజన' పత్రిక 67సంచికల ద్వారా పంచుకోవడం జరిగింది. పత్రికలో ఇన్నోవేటర్లను గురించి వ్రాయాలంటే దానికి ముందు ఎంతో తతంగం ఉంటుంది. అది సంపూర్తిగా జరిగిన తర్వాతే పత్రికలో ప్రచురణకు వస్తుంది.

ఈ ప్రక్రియలో ఎంతోమంది సహృదయులు, వాలంటీర్లు, స్వచ్ఛందంగా పాల్గొనడం వల్లే ఇన్నోవేటర్ల కథలు ప్రచురింప బడతాయి. మొదటి మూడు సంవత్సరాలు 'పల్లెసృజన' ప్రధాన వాలంటీర్లు తామే స్వయంగా ఊర్లకు వెళ్ళి తిరిగి, ఇన్నోవేటర్లను వెతికేవారు. వార్తా పత్రికలలో కాని, ఎవరో చెబితేకాని తెలుసుకుని, ఇన్నోవేటరు దగ్గరికి చేరుకుని రోజంతా వారితో గడిపి, వివరాలను సేకరిస్తారు. ఇన్నోవేషన్ చేయాలని ఎందకు అనిపించింది, అసలు సమస్య ఏమిటి? ఈయన ఎందుకు ముందుకు వచ్చాడు? అలాగే పరిష్కారం ఎలా ఆలోచించాడు? వనరులు ఎలా లభ్యమయ్యాయి?, కుటుంబ సభ్యుల సహకారం ఎలా ఉండేది? సమాజం తనపట్ల ఎలా ప్రవర్తించింది?, ఇన్నోవేషన్ పూర్తి చేయడానికి ఇంత సమయం ఎందుకు పట్టింది?, అవరోధాలు ఏమిటి?, సహకారాలు ఏమన్నా వచ్చాయా?, సమాజం, వ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు ఎలా సహకరించాయి? ఇన్నోవేషన్ ప్రస్థానం, సహృద్భావ సహకారాలతో జరిగిందా లేక కారాలు, మిరియాలు, అవహేళనలు, అవమానాలతో, నిరాశా నిస్పృహతో నిండుకున్నాయా? చివరికి ఇన్నోవేషన్ తయారై పదిమంది మెచ్చుకున్న తర్వాత, ఇన్నోవేటర్ల జీవనంలో ఏవైనా మంచి మార్పులు వచ్చాయా? వారి ఇన్నోవేషన్ వ్యవస్థ, సమాజాన్ని చేరుకుందా? లేదా పక్కన పెట్టేసిందా? ఇన్నోవేషన్ వల్ల వచ్చిన లాభమేమిటి? ఎవరు ఎలా ఎంతవరకు లాభం పొందారు? ఇన్నోవేషన్ వల్ల సమాజానికి శాశ్వతంగా ఎంతవరకు లాభం జరుగుతుంది? పర్యావరణ సంరక్షణకు తోడ్పడిందా? ..... ఇలా ఎన్నో ప్రశ్నలు, ఎన్నో వివరాలు సేకరించడం పల్లెసృజన ప్రధాన వాలంటీర్లు చేస్తారు. వీడియోలు, ఫొటోలు, లాభపడ్డ రైతులు లేదా ఇతర గ్రామస్తులతో ఇంటర్వ్యూలు అన్ని జతపరుస్తారు. ఇవన్నీ సేకరించిన తర్వాత ఇన్నోవేటర్‌కు ఆయన కుటుంబానికి కృతజ్ఞతలు చెప్పి తిరిగి వస్తారు. ఆ తర్వాత ఎడిటోరియల్ టీము అయిన శశిమోహన్ గారు, రాఘవరెడ్డి గారు ఇన్నోవేషన్ కథను వ్రాయడం జరుగుతుంది. సంపాదక వర్గం దాన్ని అంగీకరించిన తర్వాత ప్రచురణకు వెళుతుంది. ఇంత తతంగం ప్రతి కథకూ ఉంటుంది. అప్పుడు కాని మీ చేతికి అబ్బురపరిచే సామాన్య ఇన్నోవేటర్ల అసామాన్య ఇన్నోవేషన్ల కథనం మీవద్దకు చేరదు.

అయితే గత పది సంవత్సరాలుగా మెల్లిమెల్లిగా గ్రామీణ ఇన్నోవేటర్లు, ఇన్నోవేషన్లపై సామాన్య ప్రజలకు, మీడియా వారికి శ్రద్ధ కలగడం, అది వందల నుండి వేలమంది ప్రజలను ఆకర్షించడం జరుగుతూ ఉండడం వల్ల 'పల్లెసృజన' తరుపున ఎంతోమంది స్వచ్ఛందంగా తమ దరిదాపుల్లో ఉన్న ఇన్నోవేషన్లను గురించి మాకు తెలియజేస్తున్నారు. స్థానిక పత్రికల్లో, టివీ ఛానళ్లలో, యూ–ట్యూబ్‌లలో వచ్చే ఇన్నోవేషన్లు కూడా 'పల్లెసృజన'కు చేరుకుంటున్నాయి. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ నాయకులు, సమాజంలోని విశిష్ఠ వ్యక్తులు, విద్యార్థులు కూడా తమకు తారసపడిన ఇన్నోవేటర్ల గురించి పల్లెసృజనకు తెలియజేస్తున్నారు. సమాజంలో ఇంతమంది పల్లెసృజనకు చేయూతనివ్వడం శుభసూచకం. వీరంతా పల్లెసృజన వాలంటీర్లు. ఎక్కడ ఉన్నా పల్లెసృజన జ్ఞానాన్ని వెతకడానికి పాటుపడడం, వీరి సంఖ్య పెరుగుతూనే ఉండటం పల్లెసృజన ఉద్యమానికి పెద్ద బలం.

అయితే జరిగింది సరిపోతుందనుకున్న నిస్సబ్దత మనలో కలగకూడదు. ఇంకా ఎందరో ఈ యజ్ఞంలో పాల్గొనాలి. ఇదొక బాధ్యతగా అందరూ పాటించాలి. ఇన్నోవేషన్లను వెతకడం, వాటి గురించి పదిమందికి చెప్పడం, వాటిని వాడి లాభాలు పొందడం, వాటిని తమ పరిస్థితులకు తగ్గట్లుగా మార్పులు, చేర్పులు చేయడం, వారి అనుభవాల్ని పల్లెసృజనతో పంచుకోవడం, ఇలా విరామం లేకుండా పల్లెసృజన వాలంటీర్లు, పాఠకులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు 'టిఎస్ఐసి' లాంటి ప్రభుత్వ సంస్థలు నిబద్ధతతో పాల్గొనాలి. వేలమంది వాలంటీర్లు ప్రతి సంవత్సరం పల్లెసృజన కుటుంబంలో చేరుతూ ఈ జ్ఞాన యజ్ఞాన్ని కొనసాగించాలి.

2019 ప్రారంభంలో ఉప్పుతేళ్ళ ఏడుకొండలు (కృష్ణ), కనకరాజు, ముప్పారపు రాజు ఈ ముగ్గురు పల్లెసృజన స్కౌట్లుగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో ఇటీవల 50కి పైగా ఇన్నోవేటర్లను వెతికారు. ఈ ఇన్నోవేషన్లను చూడడానికి పల్లెసృజన ప్రధాన వాలంటీర్లు మూడు రోజులు ఆంధ్రప్రదేశ్‌లోని నాలుగు జిల్లాలు తిరిగారు. ఇన్నోవేషన్లను గ్రంథస్తం చేశారు. ఈ టీమ్‌లో శ్రీకర్‌గారు, శశిమోహన్ గారు, దుర్గాప్రసాద్ గారు, రాఘవరెడ్డి గారు ఉన్నారు. ఈ గ్రంథస్తమైన ఇన్నోవేషన్‌లు అంచెలంచెలుగా పల్లెసృజన పత్రికలో ప్రచురిస్తున్నాం. వీటన్నిటినీ 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (ఎన్ఐఎఫ్)కు జాతీయ స్థాయి బహుమతి కొరకు ప్రతిపాదించడం జరిగింది. అన్ని ఇన్నోవేషన్లు పల్లెసృజన ప్రదర్శనల్లో పాల్గొంటాయి. వీటికి పేటెంట్లు, ఉత్పాదన, విస్తరణ, ఆర్థిక సహకారాలు ... వీటన్నిటికీ పల్లెసృజన ప్రధాన వాలంటీర్లు శాయశక్తులా కృషి చేస్తున్నారు.

మీ అందరి తోడు మాకు కావాలి. ముందుకు రండి. కలసి ఈ మహా జ్ఞాన యజ్ఞాన్ని ముందుకు తీసుకెళ్దాం. మన తెలుగు రాష్ట్రాల్లోని సామాన్యుల జ్ఞానాన్ని పంచడం విస్తరిద్దాం.

జూన్ 21 నాడు మన పల్లె ఇన్నోవేటర్ 'పద్మశ్రీ' పురస్కార గ్రహీత 'చింతకింది మల్లేశం' కథ ఆధారంగా తీయబడిన చిత్రం "మల్లేశం" సినిమా దేశమంతటా విడుదల చేయబడింది. మీరంతా ఈ చిత్రాన్ని చూసి పల్లె ఇన్నోవేటర్లను ప్రోత్సహించండి. వారి కథలతో ప్రేరణ పొందండి.

ఈ వర్షాకాలం సమృద్ధిగా వర్షాలు కురిసి, మన ప్రజలందరు సస్యశ్యామలంగా ఆరోగ్యంతో జీవించడానికి దోహదం చేస్తుందని మనసారా ఆశిస్తూ......



భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



## ఇటు రైతుకు, అటు వ్యాపారికి లాభాలను చేకూర్చుతున్న

# ఇద్దరు స్నేహితుల సృజనాత్మకత

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

అమరావతికి పది కిలోమీటర్ల దూరంలో వున్న 'తాడికొండ' గ్రామంలో నివసిస్తున్న అపురూప స్నేహితులు నారాయణ రెడ్డి, కె.ఎల్. పాల్ లు. నారాయణ రెడ్డి సిసలైన వ్యవసాయ దారుడైతే, కె.ఎల్. పాల్ ఐటిఐలో వెల్డర్‌గా శిక్షణ పొంది తనకు 28 యేండ్ల వయసులోనే ఇదే గ్రామంలో ఓ వెల్డింగ్ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారస్తుడు. ప్రస్తుతం నారాయణ రెడ్డి వయస్సు 78 సంవత్సరాలు కాగా కె.ఎల్. పాల్ వయస్సు 65 సంవత్సరాలు.

వ్యవసాయంలో తలపండిన నారాయణ రెడ్డి 1970 ప్రాంతంలో వచ్చిన పెద్ద తుఫాను తాకిడికి తన ఊరంతా అల్లాడి పోతుండటం చూసి ఊరందరికీ తన ఇంట్లోనే ఆశ్రయమిచ్చి, అన్న పానాదులను అందించిన గొప్ప మనసు నారాయణ రెడ్డిది. ఈయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్ లోని రెడ్డి ల్యాబ్స్ సంస్థలో ఉద్యోగం చేసుకుంటూ వుంటాడు, కూతురు, అల్లుడిని తన ఇంట్లోనే వుంచుకుని వ్యవసాయం కొనసాగిస్తున్నాడు నారాయణ రెడ్డి. వయసు మీరిపోవటంతో రెండు సంవత్సరాల క్రితం తన కుమారుడు తండ్రిని నువ్వు ఇక్కడ వుండి కష్ట పడటం దేనికి, పొలం అక్క బావ చూసుకుంటారు, నువ్వు హైదరాబాద్ వచ్చెయ్ అని తీసుకుపోయాడు. అక్కడ తాను తన జీతం డబ్బులు కూడబెట్టుకుని కొనుక్కున్న స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మిస్తుంటే తండ్రిని వాటిని చూస్తూ కాలక్షేపం చేసుకోమన్నాడు. అయితే గ్రామాల్లో నివసించిన వ్యక్తులు ఒక్కసారిగా పట్టణ వాతావరణానికి అలవాటు పడాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని. ఎంత పని చేత కాకపోయినా, ఊర్లోనే దారిలో వచ్చి పోయేవారికి పలకరించుకుంటూ వృద్ధాప్యాన్ని గడపటానికి ఇష్ట పడతారే తప్ప గజిబిజిగా వుండి, ఒకరినొకరు పలకరించుకోవటానికి కూడా తీరిక లేనటువంటి పట్టణ వాతావరణం వారికి ఓ పట్టాన నచ్చదు. దాంతో నారాయణ రెడ్డి కొడుకుతో నాయనా నాకు ఇక్కడ కుదరదు గాని నేను ఊరికి పోతాను అక్కడ నేనేమి చేయకపోయినా కనీసం అక్క, బావ చేసుకునే వ్యవసాయ పనులను సలహాలిస్తూ కూర్చున్నా చాలు నాకు మనశ్శాంతిగా ఉంటుందని తిరిగి గ్రామానికే చేరుకున్న సిసలైన వ్యవసాయదారుడు నారాయణ రెడ్డి.

ఇక ఇతని ఇన్నోవేషన్ విషయానికి వస్తే పది



సంవత్సరాల క్రితం కొద్దిగా వర్షాలు ఎక్కువ కావటంతో తన ప్రత్తి పొలంలో విపరీతమైన కలుపు పెరిగిపోయింది, దాన్ని తీయించటానికి అంతర సేద్యాల కొరకు కిరాయికి వచ్చే ఎద్దులు గలవాళ్ళకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. రోజురోజుకు తన పొలం పరిస్థితిని చూసి తట్టుకోలేక దీనికో చిన్న పరిష్కారం కనుగొన్నాడు నారాయణ రెడ్డి. ఎద్దులు కొనే శక్తి, వాటిని పోషించేందుకు అవసరమైన మనుషులు లభించే పరిస్థితి లేకపోవడంతో తన పొలంలో కలుపు తీయటానికి తానే 'మనిషి లాగే గొర్రు, గుంటక' పరికరానికి రూపకల్పన చేసి ఓ మార్గాన్ని కనుగొన్నాడు. దీనికి రూపకల్పనైతే చేశాడు కాని దీన్ని తయారు చేయటం తనవల్ల కాదు అని తన మిత్రుడు కె.ఎల్. పాల్ దగ్గరకు వెళ్ళాడు 'అరేయ్ దీన్ని నాకు ఎలాగైనా చేసి ఇవ్వాలి' అని తనకు అవసరమైన పరికరం గురించి కాగితంపై గీసి చూపించాడు. ఇది తనకు ఇప్పుడు అత్యవసరమని, లేకపోతే పొలం పాడైపోతుందని అన్నాడు. అప్పుడు తన దుకాణంలో పని వత్తిడి విపరీతంగా వుండటంతో రేపు చేస్తా, మరునాడు చేస్తా నంటూ వాయిదా వేసుకుంటూ ఓ వారం రోజులు గడిపాడు కె.ఎల్. పాల్. ఇక్కడ తన పొలమేమో రోజురోజుకూ కలుపు తీవ్రరూపం దాల్చుతోంది, కిరాయి పెట్టి అంతర సేద్యం చేయిద్దామంటే కిరాయి ఎద్దులు లభించే పరిస్థితి లేదు గ్రామంలో. ఈ పరిస్థితుల్లో ఒకరోజు స్థిరంగా కె.ఎల్. పాల్ దగ్గరకెళ్ళి ఈరోజు నాకు ఎట్టి పరిస్థితుల్లో ఈ పరికరం కావాల్సిందే నీకెన్ని పనులున్నా పక్కన పెట్టి ముందు దీన్ని తయారు చేసి ఇవ్వు అని పట్టుబట్టి చేయించుకుని వెళ్ళాడు నారాయణ రెడ్డి. అలా తయారైంది ఈ ఇన్నోవేషన్.

దానితో తన పొలంలోని కలుపును తానే స్వయంగా ఎటువంటి అలుపు లేకుండా నిర్మూలించుకోవటంతో ఆ గ్రామంలోని రైతులంతా ఇతని పొలాన్ని చూసి అరే, పొలాల్లో కలుపు తీవ్రత నుండి పడరాని పాట్లు పడుతుంటే నువ్వేమో ఇంత సులభంగా పరిష్కారం కనుగొన్నావని నారాయణ రెడ్డి సృజనాత్మకను అందరూ మెచ్చుకుంటూ అతన్ని ఆకాశానికెత్తేశారు. మరునాటి నుంచే కె.ఎల్. పాల్ వెల్డింగ్ దుకాణంలో ఇతర పనులకు బదులుగా నారాయణ రెడ్డి పరికరాల తయారీనే ప్రధాన పనిగా మారిపోయింది. ఇప్పుడా గ్రామంలో ఈ పరికరం లేని ఇళ్ళు అస్సలు ఉండదు అంటే అతిశయోక్తి కాదేమో.

చిన్న చిన్న రైతులు తమ పొలాల్లో స్వయంగా దీనితోనే కలుపు నివారించుకుంటుంటే పెద్ద రైతులు కూలీలను పెట్టి వీటితోనే కలుపు తీయిస్తున్నారు. 18 సంవత్సరాల క్రితం నారాయణ రెడ్డి, పాల్ అనే మిత్రులు రూపొందించిన ఈ పరికరం ఇప్పుడు చుట్టు ప్రక్కల గ్రామాల్లోనే కాదు ఇది ఏకంగా ఒరిస్సా వరకు పాకిపోయింది. ఈ పరికరాలు గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని ప్రతి పట్టణంలో గల వెల్డింగ్ దుకాణ దారులు



చేసి అమ్ముకుంటూ వుండటం ప్రత్యక్షంగా చూసింది 'పల్లెసృజన' బృందం. కేవలం పాల్ గారే ఈ పరికరాలను ఇప్పటికే కొన్ని వేలు తయారు చేసి అమ్ముకున్నాడు అంటే దీని పనితనాన్ని ఊహించుకోవచ్చు. ఇది ఒక్క ప్రత్తిలోనే కాదు, మిరప, కొర్ర, శనగ, వేరుశనగ.... ఒకటేమిటి దాదాపు అన్ని పంటలలో అంతర సేద్యానికి విరివిగా ఉపయోగిస్తున్నారు.

తాను రూపొందించిన ఈ చిన్న పరికరం ఇంతమంది రైతుల వెతలు తీరుస్తోందన్న తృప్తితో నారాయణ రెడ్డి వుండగా, వీటి తయారీ ఒక మంచి వ్యాపారంగా మలుచుకున్నాడు పాల్. ఈ ఇద్దరు స్నేహితుల రూపకల్పనలో తయారైన ఈ పరికరం ఇంతటి ప్రాచుర్యం పొందటం 'పల్లెసృజన' బృందానికి ఎంతో ఆనందాన్నిచ్చింది. ఇప్పుడు దీన్ని అరటి, చీని, దానిమ్మ లాంటి ఉద్యాన తోటల్లో కూడా చెట్ల చుట్టూ కలుపు నివారణకు వినియోగించుకుంటున్నారు రైతులు.

చిలకలూరి పేటలోని ఓ దుకాణంలో వీటిని అమ్మకానికి పెట్టడం చూసి ఆ దుకాణదారుడిని ఇది ఎవరు





చేశారు అని అడిగితే 'ఎవరు రూపొందించారో తెలీదు కాని, ఈ ప్రాంత రైతుల అభిప్రాయం మేరకు వీటిని తయారు చేసి అమ్ముకుంటున్నాము. సీజన్‌లో వీటి గిరాకీ బాగా వుంటుంది' అన్నాడతను. అప్పుడనిపించింది ఆహా నారాయణ రెడ్డి ఆలోచన రైతుల కష్టాలను తీర్చడమే కాదు, వ్యాపారులకు ఆదాయాన్ని కూడా ఇస్తుంది కదా అని. సమాజంలో అంత పెద్ద ప్రభావాన్ని ఈ చిన్న ఇన్నోవేషన్ చేయగలిగిందా? అని ఆశ్చర్యపోయాం.

ఈ పరికరం మొదట తయారు చేసినప్పుడు కేవలం రూ. 60లకు ఇచ్చేవారు ఇప్పుడది వెయ్యి రూపాయల వరకు చేరుకుంది. మొదట వీరు తయారు చేసింది 'గుంటక' పరికరం. ఆ తర్వాత రైతుల అభీష్టం మేరకు దానికే ఎన్నో రూపాంతరాలు చేసి ఇప్పుడు 'గొర్రు, రెండు గుంటకలు' ఇలా రైతు అవసరాన్ని బట్టి దానికి మార్పులు చేసుకుంటూనే వున్నారు. ఇప్పటికీ ఈ పరికరానికి గిరాకీ తగ్గలేదు అంటే దాని పనితనమెంతటిదో రైతాంగం ఊహించుకోవచ్చు. ఈ స్ఫూర్తితో పాల్ ఆ పరికరానికే ఎన్నో మార్పులు చేర్పులు చేశారు. ఒక పరికరానికి ఒకవైపు గొర్రు మరోవైపు గుంటకను ఏర్పాటు చేశాడు. రైతు ఏది అవసరమనుకుంటే ఆవైపు తిప్పి పని చేసుకోవటం ఎంతోబావుంది అన్నారు ఆ ప్రాంత రైతులు.

తనకు తెలియకుండా అటు రైతాంగానికి, ఇటు వ్యాపారస్తులకు లాభసాటిగా వుండే పరికరాన్ని రూపొందించిన నారాయణ రెడ్డిని, మొదట తయారు చేసిన పాల్‌లను పల్లెసృజన బృందం అభినందించింది. ఇప్పుడు పాల్ ఎన్నోచోట్లకు ఈ పరికరాన్ని టోకుగా విక్రయిస్తూ వున్నాడు.

ఈ పరికరాలు కావలసిన వారు : **పాల్ – 9391616717** ఫోన్ నెంబరుతో సంప్రదించి పొందవచ్చు. ●



## డా. ఎపిజె అబ్దుల్ కలాం
# ఇగ్నైట్
## పోటీలు 2019

> "నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
> సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
> ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
> జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2019'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2019.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

**పూర్తి వివరాలకు సంప్రదించండి :**
**www.nif.org.in/ignite**

National Innovation Foundation-India
Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,
Gandhinagar - 382650, Gujarat, India.
Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803
E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite

dst.gov.in honeybee.org gian.org sristi.org cbse.nic.in

## చేస్తున్న వ్యాపారంలోనే 'శ్రీహరిబాబు' సృజనాత్మకత

# పోర్టబుల్ వాటర్ పంప్



- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

గుంటూరు జిల్లా కేంద్రంలో కృష్ణమహల్ థియేటర్ వెనుక గల రాజాగారి తోటలో ఒక సాధారణ మెకానిక్ షాపు "శ్రీ శ్రీనివాస మోటార్ టర్నింగ్ వర్క్స్". దాన్ని గత 30 సంవత్సరాలుగా హుజూర్ వెంకట రమణారావు నడుపు కుంటూ, రైతులకు సంబంధించిన పవర్ స్ప్రేయర్లు, చిన్న చిన్న మోటార్లు రిపేరు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. సాంకేతికత బాగా అభివృద్ధి చెందటంతో గత రెండు మూడు సంవత్సరాలుగా వీరి ఆదాయం కాస్త కుంటుబడింది. పదవ తరగతి వరకు మాత్రమే చదువుకున్న 42 సంవత్సరాల ఇతని కుమారుడు 'శ్రీహరి బాబు' తన తండ్రివద్ద ఈ విద్యలను చూస్తూ, సహాయం చేస్తూ చిన్న వయసులోనే క్షుణ్ణంగా నేర్చుకుని అసాధారణ మెకానిక్‌గా తయారయ్యాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు. పెద్ద అమ్మాయి ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగా, చిన్నవాడైన అబ్బాయి 9వ తరగతి చదువుతున్నాడు. షాపులో గిరాకీ తగ్గటంతో ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్న తరుణంలో శ్రీహరిబాబు మదిలో ఒక కొత్త ఆలోచన మెదిలింది. పవర్ స్ప్రేయర్లను రిపేరు చేయటం వల్లనే మనకు బాగా ఆదాయం వచ్చింది. దీనికి సంబంధించినదే ఏదైనా కొత్త పద్ధతిలో చేస్తే బావుంటుంది కదా అని ఆలోచించాడు.

అప్పుడు గుంటూరు ప్రాంతంలో కరువు పరిస్థితులు ఏర్పడి మిరప, ప్రత్తి, పొగాకు లాంటి పంటలు ఎండిపోతుంటే చూడలేక కొందరు రైతులు సమీపంలోని చెరువులు, కాలువలలో గల నీటిని ట్యాంకర్లలో తోడుకుని వచ్చి కూలీల చేత ఒక్కో మొక్క దగ్గర నీళ్ళు పోయించటం చూశాడు. ఈ పనికి చాలామంది కూలీల హడావిడి, ఈ హడావిడిలో కొందరు మొక్కలను తొక్కడం, అవి చనిపోయే ప్రమాదమూ ఉండొచ్చు! పైగా పొలమంతా నీటి బిందెలు మోసేవారు, పోసేవారు చాలామందే అవసరమౌతారు. కొందరు రైతులు వర్షాలు నేడో రేపో వచ్చే అవకాశముంది అనిపించినపుడు ధైర్యంగా పొలంలో నీరు పోసి మిరప, పొగాకు, ప్రత్తి లాంటి పంటలు నాటుతారు. దానివల్ల ఒకటి రెండు రోజుల వరకు ఆ మొక్క తట్టుకుని జీవిస్తుంది. ఒకటి రెండు రోజుల్లో వర్షం వస్తే ఆ మొక్కలు బ్రతికి త్వరగా ఎదుగుతాయి. లేకపోతే రైతు నష్టపోతాడు.

అప్పుడు అనిపించింది హరికి ఇలా మనుషుల చేత నీళ్ళుపోసే పద్ధతికి ప్రత్యామ్నాయంగా తాను రిపేర్ చేసే స్ప్రేయర్‌ను ఉపయోగించుకునేలా చేయవచ్చు అని. ఈ



సమస్యలకు పరిష్కారం కావాలంటే పవర్ స్ప్రేయర్ యొక్క మోటార్‌తోనే నీళ్ళు తోడేలా ఏర్పాటు చేయాలి అని ఆలోచించాడు. ఇక్కడ హరిబాబు ఆలోచించింది రైతుకు ఎక్కువ ఖరీదు ఉండకుండా, ఎక్కువ బరువు లేకుండా, కూలీల ఖర్చును తగ్గించేదిగా వుండాలి.

పవర్ స్ప్రేయర్ ఇంజన్ తిప్పగలిగేలా దానికి తగిన 'పంప్‌సెట్' గుంటూరు మొత్తం తిరిగినా లభించలేదు. ఇక లాభం లేదనుకుని తానే స్వయంగా చిన్న పంపుసెట్టుకు రూపకల్పన చేశాడు. పంపుసెట్టు బాహ్య భాగం తయారైంది కానీ, దీనికి లోపల నీళ్ళు తోడే 'ఇంపైలర్' ఎలా తయారు చేయాలి అని ఆలోచించాడు. మార్కెట్ మొత్తం సర్వే చేయగా సబ్‌మెర్సిబుల్ పంపులోని ఇంపెల్లర్ తన అవసరానికి ఇంచుమించు సరిపోతుందని తెచ్చుకున్నాడు. దానికి కొద్దిగా, ఇతను తయారు చేసిన పంపుసెట్టులో ఇమిడేలా చిన్నపాటి మార్పులు (వ్యాసార్థం కొద్దిగా కత్తిరించటం, మధ్యలో గల షాఫ్ట్ అతికించే భాగంలో చిన్నపాటి మార్పులు) చేశాడు. పవర్ స్ప్రేయర్ ఇంజన్‌కు ఈ పంపుసెట్‌ను బిగించి ప్రయోగించి చూశాడు. తాను అనుకున్నంత ప్రమాణంలో ఒక అంగుళం పైపులోనుండి నీరు వేగంగా చిమ్మటం మొదలు పెట్టింది. హమ్మయ్య "పవర్ స్ప్రేయర్ వాటర్ పంప్" రూపంతో తనకో కొత్త బ్రతుకుదెరువు మార్గం లభించింది అనుకున్నాడు.

సరే పనైతే అనుకున్నట్లుగానే జరిగింది. దీన్ని ఒక చట్రంలో ఎలా బిగించాలి అని ఆలోచించి, కొత్త పద్ధతి ఏమీ వద్దు తనకు తెలిసిన పవర్ స్ప్రేయర్‌లాగే తయారు చేద్దాం అనుకుని దాదాపు పవర్ స్ప్రేయర్ అంత పరిమాణంలోనే చిన్న పైపులతో ఒక ఫ్రేము తయారు చేశాడు. అందులో చిన్న పెట్రోల్ ట్యాంకు, దాని క్రిందనే ఇంజను దానికి మరో వైపున పంప్‌సెట్ బిగించాడు. దీని మొత్తం బరువు 8 కిలోలు వుంటుంది. దీన్ని ఎవరైనా, ఎక్కడికైనా సులువుగా తీసుకు వెళ్ళవచ్చు. ఈ పంపు 25 అడుగుల లోతు లేదా దూరం నుండి (సక్షన్) నీటిని సులభంగా లాగ గలదు. 500 అడుగుల దూరం వరకు కూడా నీటిని పారించుకోవచ్చు. ఎక్కువ లోతు నుండి నీటిని లాగి, 500 అడుగుల దూరం వరకు నీళ్ళు పారాలంటే గంటకు ఒక లీటరు పెట్రోలు ఖర్చవుతుంది. ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు రోజుకు పది ఎకరాల పొలంలో మొక్కలకు నీళ్ళు పట్టవచ్చు. డ్రమ్ములు లేదా ట్యాంకర్లలోని నీటిని తోడే అవకాశముంటే, 500 అడుగుల దూరం పారించటానికి ఒక లీటరు పెట్రోలు ఒకటిన్నర లేదా రెండు గంటల వరకు కూడా పని చేస్తుంది.

అదే పదెకరాలకు మామూలుగా మనుషుల చేత నీరు పోయించాలంటే కనీసం 30 నుండి 40 మంది దాకా కూలీల ఖర్చవుతుంది. ఈ ఖర్చు పెట్టుకోగలిగినా, కూలీల లభ్యత అతి పెద్ద సమస్య కావటంతో శ్రీహరి తయారు చేసిన ఈ చిన్న మోటారు ఎంతగానో ఉపయోగ పడుతుంది కదా అన్న సానుకూల ప్రచారం రావటంతో ఆ ప్రాంతంలోని దాదాపు ప్రతి గ్రామంలో రెండు మూడు పంపుసెట్లు అమ్మ గలిగాడు



హరిబాబు. ఈ పంపుసెట్‌తో పాటు 25 అడుగుల సక్షన్ పైపు, ఫుట్‌వాల్వ్‌తో సహా విక్రయిస్తాడు. ఇక డెలివరీ పైపు రైతు పొలంను, అవసరాన్ని బట్టి 500 అడుగుల వరకు తీసుకోవాల్సి వుంటుంది.

దీనికి నిర్వహణా ఖర్చులు కూడా పెద్దగా ఏమీ వుండవు. రైతు సాధారణంగా సంవత్సరంలో కొన్ని రోజులు మాత్రమే దీన్ని ఉపయోగించుకుని ప్రక్కన పెట్టేస్తూ వుంటాడు కాబట్టి సంవత్సరానికోసారి ఇంజన్ యొక్క కార్బోరేటర్‌ను శుభ్రం చేసుకుంటే సరి. అంతకు మించిన నిర్వహణా ఖర్చు వుండదు. కాకపోతే పెట్రోలులో మాత్రం 2-టి ఆయిల్ కలపడం తప్పనిసరి. మోపెడ్లు, స్కూటర్లకు వేసినట్లుగా పెట్రోలులో ఆయిల్ కలిపి వేయాల్సి వుంటుంది. దీన్ని ఎంతసేపు వినియోగించినా మోటార్ వేడి కావటం లాంటిదేమీ వుండదు.

దీన్ని కేవలం పొలం పనులకే కాదు, మామూలుగా కుళాయికి పైపు తగిలించి నీరు పారించుకునే ఎటువంటి పనులకైనా ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు నీటిని వేగంగా పారిస్తూ పెద్ద పెద్ద దేవాలయాలు, ఫంక్షన్ హాళ్లు శుభ్రం చేయాలన్నా, వాము దొడ్లలో గడ్డి లాంటివి తడపాలన్నా, ఇలా ఎలాంటి నీటి పారుదల అవసరమైన పనులకైనా దీన్ని వినియోగించుకోవచ్చు. ఇది 'పోర్టబుల్ వాటర్ పంపు' సెట్ కావటంతో భవనాల నిర్మాణంలో సిమెంటు గోడలు తడపటం (క్యూరింగ్) కోసం కూడా దీన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. బహుళ అంతస్తుల భవనాలకు క్రింద నీటి తొట్టె (సంపు) నుండి నీటిని పైనున్న అంతస్తు వరకు సులభంగా పారించుకోవచ్చు.

దీని సీజన్ ఎండా కాలం ప్రారంభమౌతుంది. హరిబాబు ప్రతి సీజన్‌లో 800 నుండి 1,000 పంపుసెట్ల





దాకా విక్రయిస్తున్నాడు అంటే ఈ పరికరం ఎంత ఉపయోగకరంగా ఉందో గమనించవచ్చు. ఇతను అమ్మటమే కాక, జిల్లాలోని మండల కేంద్రాలలో హార్డ్‌వేర్ షాపుల వాళ్ళు కూడా ఇతనివద్ద తీసుకువెళ్ళి విక్రయిస్తూ వుంటారు. చాలామంది రైతులు ఇతని షాపువద్ద కొనుగోలు చేసి తోటి రైతులకు చెప్తూ వుండటంతో ఎటువంటి వ్యాపార ప్రకటనల ఖర్చు లేకుండా సాఫీగా వ్యాపారం సాగుతోంది హరిబాబుకు.

షాపు చిన్నది కావటం వల్ల దీనికి తగిన ఫ్రేములు, పంపుసెట్లను బయటి వర్క్‌షాప్‌ల వద్ద పెద్ద మొత్తంలో తయారు చేయించి వుంచుకుంటాడు. ఇతను ఒక సహాయకుడు కలిసి ఫ్రేములకు ఇంజను పంప్‌సెట్లు బిగించుకుంటూ వుంటారు. సంవత్సరమంతా చిన్న చిన్న మెకానిక్ పనులతో భృతి గడిచినా, సీజన్‌లో మాత్రం ఈ మోటార్ల విక్రయాలతో మంచి ఆదాయం వస్తుంది అంటాడు హరిబాబు.

తనకు సంబంధించిన వ్యాపారంలోనే కొత్త పద్ధతిని కనిపెట్టి కాలానుగుణంగా వ్యాపారాన్ని లాభం వైపు మలుచుకున్న శ్రీహరి బాబును అభినందిస్తోంది 'పల్లెసృజన'. ఇలా వ్యాపారాలు తగ్గుముఖం పడుతున్నాయి అని వ్యాపారులు దిగులు చెందక తాము చేస్తున్న వ్యాపారంలోనే వినియోగదారునికి ఖర్చులు తగ్గిస్తూ రైతులకు కావలసిన పరికరాలను తయారు చేసే తమ ఉత్పత్తుల అమ్మకాలను నిత్యనూతనంగా ఉంచుకుంటారని ఆశిస్తున్నాం. ●

**ఇన్నోవేటర్ శ్రీహరిబాబు ఫోన్ : 9908979986**

# ప్రకృతితో మమేకమై 'తొలకరి'ని ప్రారంభించండి



## సృజనాత్మక ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్త 'విజయ కుమార్' సలహాలు

ఏరువాక మొదలైంది. 'మృగశిర' కార్తె చల్లగా ఉభయ తెలుగు రాష్ట్రాలను పలుకరించింది. కొన్నిచోట్ల చిరు జల్లులు, మరికొన్ని ప్రాంతాల్లో ఓమోస్తరు వర్షాలు కురవటంతో రైతాంగం తమ వ్యవసాయ పనులను మొదలు పెట్టారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పడిన నూతన ప్రభుత్వాలు కూడా 'రైతుబాట' పట్టాయని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఈ సందర్భంగా 'పల్లెసృజన' పాఠకులకు చిరపరిచితుడైన రైతు ఇన్నోవేటర్, కడప జిల్లాకు చెందిన 'విజయ కుమార్' రైతాంగానికి కొన్ని సూచనలు చేయాలన్న సంకల్పంతో చేసిన వివరాలు ఉభయ రాష్ట్రాల రైతాంగం కోసం.

ఈ మే, జూన్ మాసాల్లో పొలాన్ని ఎక్కువ లోతుగా దున్నుకోకుండా పైపాటుగా దున్నుకోండి, కొందరు లోతుగా దుక్కి దున్నుకొమ్మని సలహాలు ఇస్తుంటారు. నాకు తెలిసినంత వరకు అది అంత మంచి ఫలితాన్ని ఇవ్వదు. వారు చెప్పేంత కొలతల్లోనే రసాయనిక ఎరువులు వాడే వారికి అది సరిపోతుందేమో, అయితే పొలాన్ని లోతుగా దుక్కి దున్ని, వారి సలహాకు మించిన మోతాదులో రసాయన ఎరువులు వేయటం వల్ల అన్ని విధాల నష్టమే తప్ప, లాభం ఉండదు. పైగా ఎక్కువ రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించు కోవటం వల్ల మీరు పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందే తప్ప, ఆదాయం దాదాపు శూన్యం అని ఘంటాపథంగా చెప్పగలను అంటున్నాడు విజయ కుమార్.

మృగశిర కార్తె ముగిసేలోపు పొలాలను శుభ్రం చేసుకుని విత్తటానికి సిద్ధంగా ఉంచుకోండి, ఆ తర్వాత వచ్చేది 'ఆరుద్ర' కార్తె. ఈ కార్తె విత్తనాలు వేయటానికి ఎంతో ఉపయుక్తమైనది. మృగశిర నుండి ప్రకృతి ప్రసాదించిన వరంగా వేడిని తగ్గించుకుంటూ వచ్చి, ఆరుద్ర కార్తె వచ్చేటప్పటికి భూమినుండి చల్లదనం (తేమ) పైకి వస్తూ వుంటుంది. దీన్నే కొన్నిచోట్ల 'ఎగజెమ్ము' అని కూడా అంటారు. ఇది సృష్టి ధర్మం. అందుకే ప్రకృతిని నమ్ముకుని జీవించే రైతు ఆ ప్రకృతి ధర్మానికి అనువుగా వెళ్తూ పంటలు విత్తుకుంటే లాభ పడతాడు, పురుగులు, తెగుళ్ళు కూడా తక్కువగా వచ్చే అవకాశాలుంటాయి. ఎప్పుడైతే ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ, అనువుగాని సమయంలో విత్తనాలు వేసుకుంటేనే లేనిపోని తెగుళ్ళు, పురుగులు పెరిగిపోతాయి. ఫలితంగా రైతు పురుగు మందులకే ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి రావడమే కాక, సమాజానికి కూడా విషతుల్యమైన ఆహారాన్ని అందించిన వారమవుతాం.

రైతాంగం గొర్రెదాటుగా ఈ సంవత్సరం రేటు ఏది ఎక్కువగా వుందంటే మరుసటి సంవత్సరం అందరూ వాటినే వేసి, మార్కెట్ రేటు పడిపోయి, నష్టాల పాలవటం లాంటి మార్కెట్ జిమ్మిక్కులను గమనించి ప్రతి సంవత్సరం మీకుమీరు ఆలోచించుకుని, ఏయేటికాయేడు పంట మార్పిడులు చేసుకుంటే (ఏగిలి మార్పిడి జరిగితే) అన్ని పంటలు సమృద్ధిగా పండుతాయి. ప్రజలకు మంచి ఆహారం, పశువులకు మంచి పశుగ్రాసం లభించేలా పంటలను వేసుకుంటే మంచిది అంటున్నారు విజయకుమార్.

ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ పెరిగి పోవటం కనిపిస్తుంది. ఆహార పదార్థాలలో విషతుల్యాలు ఎక్కువ కావటమే ఈ అనారోగ్యాలకు కారణం అని తెలుసుకున్న తర్వాత సేంద్రియ ఆహార పదార్థాలపై ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఆ పరంపరలో ఇప్పుడు 'కొర్ర అన్నం' పైన మక్కువ పెరిగిపోవటం గమనిస్తునే వున్నాం. ఈ కొర్ర పంట దాదాపు అన్ని పంటలలోకన్నా ఖర్చు, శ్రమ

తక్కువ. పైగా ఎటువంటి పురుగు మందులు ఉపయోగించ నవసరం లేని పంట. ఇది పశువులకు కూడా అత్యంత ప్రీతికరమైన ఆహారాల్లో ఒకటి. కొర్రలలో ఐదు రకాలు ప్రస్తుతం మన తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులో వుండి, ప్రాచుర్యం పొంది మంచి దిగుబడులు, మార్కెట్ లభిస్తోంది. అవి కొర్ర, అండుకొర్ర, ఊదలు, బరిగలు, సామలు. ఇవి మంచి పౌష్టికమైన ఆహారం కావటం, ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు వీటిని ఉపయోగించటం వలన మధుమేహం నియంత్రణలో వుంటుందని డాక్టర్లు కూడా సలహా ఇస్తుండటంతో మాత్రలు మింగి ఆరోగ్యం పాడు చేసుకునే దానికన్నా ఈ అన్నం తిని నియంత్రణలో వుంచుకోవటమే మేలని అనుకుంటున్నారు. కొర్రలలో అంతర పంటగా చాలామంది కంది సాగు చేస్తూ వుంటారు. అది చాలా మంచి పద్ధతి. కొర్రపంట అయిపోయిన తర్వాత కంది బాగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది, లాభదాయకంగా కూడా వుంటుంది.

కొర్ర పంట త్వరగా ముగుస్తుంది కాబట్టి ముగిసిన వెంటనే అవకాశమున్న రైతులు 'శనగ' పంట వేసుకున్నట్ల యితే అది కేవలం చలికి పెరిగే గుణముంటుంది. అదృష్టం కొద్దీ పైరగాలి బాగా వీచిందంటే మంచి దిగుబడులు కూడా వస్తాయి.

ఆ తర్వాత ప్రస్తుతం సాగు చేసే ఆకు కూరల విషయానికి వస్తే చాలావరకు మార్కెట్లో లభించేవి 'చుక్కకూర, మెంతికూర, గోంగూర, తోటకూర, పాలకూర, బచ్చల కూర, కొత్తిమీర' లాంటి కొన్ని మాత్రమే లభ్యమవుతున్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆకు కూరలు ప్రసిద్ధి చెంది వుంటాయి. ఆయా ప్రాంతాల వారు వాటిని సాగు చేసుకుంటే మంచి లాభాలను పొందవచ్చు. ఈ ఆకు కూరలు అతి తక్కువ సమయంలో దిగుబడిని ఇచ్చేవి కాబట్టి ప్రతి రైతు తమ పొలంలో అత్యల్ప భాగాన్ని ఈ ఆకు కూరల కోసం కేటాయించి వేసుకున్నట్లయితే వీటిపైన వచ్చే ఆదాయం ప్రధాన పంటకు పెట్టుబడిగా మారి, తక్కువ ఖర్చుతో, ఎక్కువ లాభాలను పొందటమే కాక, ప్రధాన పంటకు పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సిన అవసరం కూడా రాదు. అసలు తొలకరి వర్షాలకు పండే ఏ ఆకు కూరైనా సరే వండుకుని, జొన్నరొట్టెతో కలిపి తింటే చాలా రోగాలను నియంత్రించవచ్చు.

కొంతమంది రైతులు ప్రధాన పంటపై పెట్టుబడి కొరకు కూరగాయల సాగు చేస్తూ వుంటారు. రాబోయే ఈ రెండు మాసాల్లో కూరగాయలు సాగు చేసుకున్నట్లయితే తక్కువ తెగుళ్ళు, పురుగు దాడులనుండి బయట పడవచ్చు. ముఖ్యంగా గోరు చిక్కుడు, బెండ లాంటి పంటలు ఈ



కార్తులలో మంచి దిగుబడినిస్తాయి. తీగజాతి ఆకు కూరలైన బీర, సొర, చిక్కుడు, కాకర లాంటి కూరలయితే ఆగస్టు మాసం వరకు నాటుకున్నా మంచి దిగుబడులు వస్తాయి, తక్కువ తెగుళ్ళ ప్రభావం కూడా వుంటుంది. ఒక్క వంగ మాత్రం ఇప్పుడు వేస్తే తెల్లదోమ అధికంగా వచ్చే అవకాశముంటుంది.

ముఖ్యంగా రైతు గమనించాల్సింది ఏమిటంటే ఏ పంటలు వేసినా పంట ముగిసిన తర్వాత పంటయొక్క అవశేషాలను అంటే కొయ్యలు, కంది కట్టె, జొన్న కొయ్యలు లాంటి వాటిని కూలీలు పెట్టి మరీ ఏరించి పొలంలోనే కాల్చి వేస్తూ వుంటారు. ఇది రైతుకు చాలా నష్టం. ఈ అవశేషాలు అతి తక్కువ సమయంలో మట్టిలో కలిసిపోయి, ఎరువుగా మారే లక్షణాలున్నవి. భూమిని కాల్చడం వల్ల రైతుకు ఎక్కువ నష్టం జరుగుతుంది. పంట ముగిసిన తర్వాత ఒకటి రెండుసార్లు దున్ని, వీలైతే 'రొటోవేటర్' ను పొలంలో తిప్పినట్లయితే ఈ అవశేషాలన్నీ చిన్న చిన్న ముక్కలుగా మారి, త్వరగా మట్టిలో కలిసిపోతాయి. భూమికి సారవంతమైన ఎరువుగా మారుతాయి. ఆ భూమినుండి వచ్చిన శక్తి అదే భూమిలోనే కలిసిపోతే మంచిది కదా అంటాడు విజయ కుమార్.

ఈ తగలబెట్టడం అనేది పోడు వ్యవసాయం నుండి వచ్చిన అలవాటు. గిరిజన జాతివారు కొండలపైన వ్యవసాయం కాబట్టి వాళ్ళు ఒక స్థలంలో రెండుమూడు సంవత్సరాలు వచ్చే పంట వేసుకుని, వాటిని తీసి తగలబెట్టి మరలా రెండు లేదా మూడు సంవత్సరాలు ఆ భూమిలో ఎటువంటి పంట వేయకుండా మరోచోట వేసుకుంటారు కాబట్టి వారికి అది బాగా పని చేస్తుందని మనం మన పొలాల్లో ప్రతి సంవత్సరం వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టి మనకు మనమే నష్టం చేసుకుంటున్నామని గమనించాల్సిందిగా కోరుతున్నారు **విజయకుమార్ (ఫోన్: 9849648498)**



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## కొబ్బరి బోండాం కొట్టి నీటిని చల్లపరిచే యంత్రం



**సమస్య - పరిష్కారం :**

బయట మార్కెట్లో చల్లటి పానీయాలు ఏ మారుమూల దుకాణాల్లోనైనా ఎప్పుడు బడితే అప్పుడు విరివిగా లభిస్తున్నాయి. కొబ్బరి బోండాన్ని కొట్టటం, దాని నీరు తీసి చల్లగా చేయటం శ్రమ, సమయంతో కూడుకున్నది కనుక కొబ్బరి నీళ్ళు ఆరోగ్యానికి మేలు చేస్తాయి అని తెలిసినా విరివిగా వాడకంలోకి రాలేదు. కర్నాటక రాష్ట్రానికి చెందిన వినోద్ మహదేవయ్య ఈ సమస్యకు పరిష్కారం కనుగొన్నాడు. అతను రూపొందించిన యంత్రం కొబ్బరి బోండాన్ని కొట్టి, నీరు తీసి వెంటనే చల్లబరుస్తుంది.

**పరికరం :**

ఈ పరికరం హైడ్రాలిక్ శక్తి ద్వారా కొబ్బరి బోండాన్ని పగలగొడతుంది. క్రింద అమర్చిన ఒక పల్లెం లోకి కొబ్బరినీళ్ళు చేరుతాయి. దాని క్రింద ఒక పెద్ద ఐసుగడ్డ ఏర్పాటు చేసి వుంటుంది. దాని క్రింద ఇసుక అమర్చబడి వుంటుంది. ఐస్ గడ్డకు, ఇసుకకు మధ్యలో సన్నటి గొట్టం చుట్టబడి వుంటుంది. కొబ్బరి నీళ్ళు ఈ గొట్టం ద్వారా బయటకు వచ్చేలోపల బాగా చల్లబడతాయి. నీళ్ళు బయటకు వచ్చేటప్పటికి 14 నుండి 15 డిగ్రీల సెంటీగ్రేడ్‌లో చల్లబడి వుంటాయి. పది కిలోల ఐసు ముక్కను ఏర్పాటు చేసుకునే అవకాశం వుంది. దీనితో 200 మి.లీ. పరిమాణం గల 400



గ్లాసుల కొబ్బరి నీటి కొరకు ఉపయోగించుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రం ఎత్తు 48 అంగుళాలు, పొడవు 30 అంగుళాలు, వెడల్పు 15 అంగుళాలు కలిగి వుంటుంది.

❀ కొబ్బరి నీళ్ళు పట్టుకోవడానికి ఒక కుళాయి ఏర్పాటు చేయబడి వుంటుంది.

❀ యంత్రం మొత్తం బరువు 65 కిలోలు వుంటుంది.

❀ దీని చుట్టూ ఫైబర్‌తో కప్పి వుంచటం వల్ల యంత్రం అందంగా కనిపిస్తుంది.

**ముఖ్యాంశాలు :**

❀ కొబ్బరి బోండం కొట్టడం, నీరు చల్లబరచటం వెంటవెంటనే జరిగిపోతాయి.

❀ కొబ్బరి నీళ్ళ వ్యాపారస్తులు లాభసాటిగా వాడుకోవచ్చు.

❀ కొబ్బరి బోండాన్ని కత్తితో కొట్టే శ్రమ లేదు కాబట్టి ఎటువంటి అపాయం కూడా ఉండదు.

❀ కొట్టిన కొబ్బరి బోండాం నుండి కొబ్బరి తీయటం, తాటి ముంజల నుండి ముంజలను తీయటం కూడా సులభంగా చేసుకోవచ్చు.

**పురస్కారాలు :**

❀ 2013లో ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో ప్రోత్సాహక బహుమతి లభించింది.

**వివరాలకు సంప్రదించండి :**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్ : 96528 01700**
E mail: subhash4@gmail.com,
Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903
E mail: bd@nifindia.org, web : www.nif.org.in

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



శ్రీశైలం

యూరియా



సోలార్ స్ప్రేయర్



కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.

ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :

77, రోడ్ నెం. 3, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

# నిమ్మకాయలు కోసే యంత్రం

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జె. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

ఊరగాయల పరిశ్రమ చాలా శ్రమతో కూడుకున్నది. ఈ పరిశ్రమ దేశం మొత్తం వ్యాపించి వున్నా, దక్షిణ భారత దేశంలో ఎక్కువగా ఉందని చెప్పొచ్చు. పెద్దయెత్తున ఊరగాయలు తయారు చేసే పరిశ్రమలు కొన్ని వున్నా, చాలా వరకు మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రవగానే విరాజిల్లుతోంది. ఈ పరిశ్రమలో చెప్పుకోతగ్గ అంశమేమిటంటే ఇది కాలంమీద ఆధార పడిన పరిశ్రమ. నిమ్మకాయ ఒక్కటే సంవత్సరానికి రెండుసార్లు పండే పంట. ఏప్రిల్ జూన్‌లలో అదేవిధంగా సెప్టెంబర్ డిసెంబర్ మధ్య కాలంలో నిమ్మకాయలు విరివిగా పండుతాయి. ఈ సమయంలో నిమ్మకాయలు కోయటానికి కూలీలు లభించినా, ఎక్కువ వేతనాలు అడుగుతారు. ఈ సమస్యకి పరిష్కారంగా తమిళనాడుకు చెందిన ఎన్. నాగరాజన్ నిమ్మకాయలను కావలసిన సైజులో తరగటానికి ఉపయోగపడే ఒక యంత్రాన్ని కనుగొన్నాడు.

**పరికరం :**

ఈ యంత్రం సహాయంతో నిమ్మకాయలను కావలసిన సైజులో సులభంగా తరగవచ్చు. ఈ యంత్రం ప్రత్యేకించి ఆహార పదార్థాల తయారీదారులకి, ఊరగాయలు, మసాలాలు తయారు చేసేవారికి ఉపయోగకరం.

**సాంకేతిక వివరాలు :**



❀ దీని పొడవు 40 అంగుళాలు, ఎత్తు 30 అంగుళాలు, వెడల్పు 40 అంగుళాలు.

❀ యంత్రం మొత్తం బరువు 350 కిలోలు.

❀ రెండు హార్స్‌పవర్‌ల ఎ.సి. మోటారు బిగించబడి వుంటుంది.

❀ 220 వోల్టుల కరెంటు అవసరమౌతుంది. 3 ఫేస్‌లు మరియు సింగిల్ ఫేస్ మోటార్లతో లభ్యం.

❀ యంత్రం ఆహార పదార్థాలకి వాడదగ్గ స్టీలు మరియు ఎం.ఎస్. స్టీల్‌తో తయారు చేయబడింది.

**ముఖ్యాంశాలు :**

❀ 0.75 అంగుళాల నుండి 2.5 అంగుళాల చుట్టు కొలత గల కాయలను స్ప్రింగ్ లోడ్ మెకానిజమ్ ద్వారా తరుగుతుంది.

❀ నిమిషానికి 150 నిమ్మకాయలను తరగవచ్చు.

❀ ఒక క్రమపద్ధతిలో ఒకేసైజుగల ముక్కలుగా తరుగుతుంది.

❀ తరిగిన ముక్కలను తేలికగా సేకరించవచ్చు.





❀ ఒక నిమ్మకాయను 4/ 8/ 16 ముక్కలుగా తరగవచ్చు.

❀ చాలా తక్కువ కరెంటు ఖర్చవుతుంది. గంటకో యూనిట్ కరెంటును మాత్రమే వినియోగిస్తుంది.

❀ ఒకే మనిషి ఈ యంత్రాన్ని నడపచవచ్చు.

❀ ఎటువంటి వృధా ఉండదు.

**పురస్కారాలు :**

❀ 2005లో ఎన్ఐఎఫ్ వారి 3వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో జాతీయ స్థాయి బహుమతి లభించింది.

**వివరాలకు సంప్రదించండి :**

**పల్లెసృజన, సుభాష్, ఫోన్ : 96528 01700**
**E mail: subhash4@gmail.com,**
**Phone: +91 79 26732456/ 2095, Fax : +91 79 26731903**
**E mail: bd@nifindia.org, web : www.nif.org.in**

## సంవత్సరానికి మూడుసార్లు కాసే మామిడి రకం అంటు మొక్కలు

పాఠకులకు మనవి, 'జగదాంబ ఎన్–1, ఎన్–2 రకం మామిడి మొక్కలు సంవత్సరంలో మూడు సార్లు కాయలు కాసే ఈ మొక్కలు కావలసిన వారు క్రింది బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు జమ చేయగలరు. ఒక మొక్క రూ. 600/–లు

పూర్తి వివరాలకు సంప్రదించండి:

సుభాష్ చందర్, మేనేజింగ్ డైరెక్టర్, క్రియేటివ్ మైండ్స్, ఫోన్:96528 01700, 040–27111959

బ్యాంకు అకౌంటు వివరాలు :

Name of the A/c: Creative Minds
A/c No: 510101006285094
IfScode : CORP0000640
Corporation Bank, Sainikpuri Branch



# 'తెలంగాణ ఇన్నోవేషన్ల ఉత్సవం'లో పల్లెసృజన వెలుగులు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా 02 జూన్, 2019 నాడు హైదరాబాద్ మహానగరంలోని నెక్లెస్ రోడ్డుపైన గల పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ ఇన్నోవేషన్ల ఉత్సవం' లో భాగంగా 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు వారి ఇన్నోవేషన్లతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో సుమారు 45 ఇన్నోవేషన్లు, 21 మంది ఇన్నోవేటర్లు పాల్గొన్నారు. పండుగ వాతావరణం నెలకొన్న ఆ ఉత్సవంలో అనేకమంది రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులతో పాటు వేలాదిమంది ప్రజలు, ఈ ఇన్నోవేషన్లను చూసి తెలంగాణ ప్రాంతంలో ఇన్నోవేషన్ రంగంలో అందునా గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా చదువుకోని గ్రామీణ శాస్త్రవేత్తలలో ఇంత అద్భుతమైన సృజనాత్మకత మాత్రమే కాక, సామాజిక సమస్యలకి పరిష్కారాలు చూపించే శక్తి ఉందా? అని అబ్బురపడి ప్రశంసల వర్షం కురిపించారు. ఈ ప్రదర్శన చిత్రమాలిక....





















# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## ప్యాకింగ్ పేపర్లు సేకరించే యంత్రం

**జాతీయ రెండవ పురస్కారం – మెకానికల్ విభాగం**

**ఇన్నోవేటర్స్ : డిప్తాన్షు మాల్వియ మరియు ముకుల్ మాల్వియ, సిరోహి, రాజస్థాన్.**

డిప్తాన్షు మాల్వియ, ముకుల్ మాల్వియ సోదరులు ఇద్దరూ క్రింద పడేసిన చాక్లెట్ కాగితాలు, బిస్కట్ ప్యాకెట్ పైన వున్న కవర్లు, ఇతర తినుబండారాలు ప్యాక్ చేసిన కవర్లు మొదలైన వాటిని సేకరించి, చెత్త బుట్టలోకి చేర్చేలా మోటర్‌తో నడిచే పరికరాన్ని కనిపెట్టారు.



చిరుతిళ్ళు తినటం అంటే చాలామందికి ఇష్టం. ఇవి రకరకాల, రంగురంగుల ప్యాకెట్లలో అందంగా అలంకరించి అమ్ముతూ వుంటారు. ఇవి తినటం సంగతి అటుంచి, వీటి వలన పేరుకుపోయిన చెత్తను చూస్తే భయమేస్తుంది. సాధారణంగా తినుబండారాలు ప్యాక్ చేసే అన్ని పద్ధతులలో ప్లాస్టిక్‌నే ఎక్కువగా వాడుతూ వుంటారు. ఇది భూమిలో త్వరగా జీర్ణం కాక, పర్యావరణానికి ఎనలేని హాని చేస్తాయి. పార్కులలో, బస్టాండ్‌లలో, పాఠశాలల వద్ద, ప్రదర్శనలు జరిగే చోట, సమావేశాలు జరిగేచోట ర్యాపర్లు, చాక్లెట్లు, బిస్కట్లు, కేకులు, చిప్స్, మంచినీళ్ళ ప్యాకెట్లు చెల్లా చెదరుగా పడి వుండటం గమనిస్తూ వుంటాము. ఈ చెత్తని చేతితో ఎత్తి తీసివేయటం తప్ప ప్రత్యేకించిన యంత్రమేదీ లేదు. ఈ చెత్త తీసే ప్రక్రియలో శ్రమతో పాటు సమయం ఎక్కువ. మాల్వియ సోదరులు ఒకసారి బస్టాండులో ఊడ్చే వ్యక్తి అక్కడ పడివున్న ఖాళీ కవర్లు, చిత్తు కాగితాలు, చాక్లెట్, బిస్కట్‌లపై చుట్టిన కాగితాలు శుభ్రం చేస్తూ వుండగా అతన్ని గమనించారు. ప్రతిసారి చెత్తను తీయటానికి అతను వంగుని, చెత్తని ఎత్తి డబ్బాలో వేయటానికి పడే శ్రమను అర్థం చేసుకున్నారు.



అప్పుడే వీరికి దీనికొక యంత్రం రూపొందించాలని సంకల్పించుకున్నారు.

వీరు చేసిన యంత్రము చాలా సులువుగా పని చేయటమే కాక, ఏవిధమైన ఇబ్బందులూ లేక ఊడ్చే కార్మికులకి చాలా సహాయకారిగా వుంటుంది. ప్రత్యేకించి పురపాలక సంఘాలలో, గ్రామ పంచాయితీలలో పారిశుద్ధ్య పని వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం దేశంలో 'స్వచ్ఛ భారత్ అభ్యాన్' కార్యక్రమం విస్తృతంగా అమలు అవుతున్న తరుణంలో తమవంతు భాగంగా ఎన్ఐఎఫ్ వారు ఈ సోదరులు తయారు చేసిన యంత్రానికి కొద్దిపాటి మార్పులు చేసి, ఇంకా సమర్ధవంతంగా పనిచేసేలా రూపొందించారు.

ఇద్దరు సోదరులకి కూడా సైన్స్ అంటే మక్కువ ఎక్కువ. ఇద్దరూ కలిసి ఎన్నో సైన్సు పోటీల ప్రదర్శనలో పాల్గొని అనేక బహుమతులు గెలుచుకున్నారు. దీప్తాన్షుకి శాస్త్రవేత్తల, ఇన్నోవేటర్ల జీవిత గాథలు చదవటం చాలా ఇష్టం. పెద్దయ్యాక ఇస్రోలో చేరి దేశానికి సేవ చేయాలి అనుకుంటున్నాడు. ముకుల్‌కి కూడా పుస్తకాలు చదవటమంటే ఇష్టం. శాస్త్ర సంబంధ పుస్తకాలు చదువుతూ వుంటాడు. పెద్దయ్యాక ఇంజనీర్ కావాలి అనుకుంటున్నాడు.

2015వ సంవత్సరంలో ఈ ఇరువురి సోదరులకి వారు తయారు చేసిన చెత్తను సేకరించే యంత్రం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించటానికి అవకాశం లభించింది. అంతేకాక, 2017లో 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో మెకానికల్ విభాగంలో 2వ బహుమతిని రాష్ట్రపతి చేతులమీదుగా అందుకున్నారు. ●



# వంట చేయటానికీ, ఆరబెట్టడానికి ఉపయోగపడే స్టౌ

**జాతీయ రాష్ట్ర స్థాయి బహుమతి - మెకానికల్ విభాగం**
**ఇన్నోవేటర్ : మైబం దేబేన్‌సింగ్, పశ్చిమ ఇంఫాల్, మణిపూర్**



65 సంవత్సరాల దేబేన్‌సింగ్‌ది వెల్డింగ్ చేసి వస్తువులను తయారు చేసే వృత్తి. మణిపూర్‌లో చేపలను, మాంసపు ముక్కలను, కొన్ని కాయగూరలను ఎండబెట్టి మనం చేసుకునే ఒరుగులలా చేసి తరవాత తినటం అలవాటు. దేబేన్ సింగ్ వంట చేయటానికి, అదే సమయంలో పైన చెప్పిన వాటిని ఆరబెట్టడానికి కూడా ఉపయోగ పడేలా ఒక పొయ్యిని తయారు చేశాడు.

దేబేన్ సింగ్ 12 మంది సంతానంలో ఒకరు. ఇతని తండ్రి ప్రభుత్వ జీపు డ్రైవరుగా పని చేస్తే తల్లి ఇల్లు చూసుకునేది. చిన్నప్పటినుంచి కూడా దేబేన్‌కి చిన్న చిన్న బొమ్మలు చేయటం, నమూనా విమానాలు చేయటం సరదా. ఆటలంటే ఇష్టమున్న ఇతను ఫుట్‌బాల్, వాలీబాల్ లాంటి ఆటల్లో చురుగ్గా పాల్గొనేవాడు. 12 మంది పిల్లలతో పెద్ద సంసారం అయ్యేసరికి ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉండేవి. పర్యవసానంగా దేబేన్ 7వ తరగతితో చదువు ఆపేయవలసి వచ్చింది. తొలుత తండ్రిలాగానే జీపు డ్రైవరుగా పని చేశాడు. కాని తరచూ దూర ప్రయాణాలు చేయవలసి రావటంతో అది మానేసి, కమ్మరిపని నేర్చుకొని స్టౌలు, ఇతర గృహ ఉపయోగ వస్తువులు తయారు చేయటంలో స్థిరపడి పోయాడు. గత 35 సంవత్సరాల నుంచి ఇదే పనిలో వున్న దేబేన్ కుటుంబంలో ఇతను, ఇతని భార్య, కొడుకు, కోడలు, ఒక మనవడు ఉన్నాడు.

ఈ వంట చేయటానికి, ఆరబెట్టడానికి ఉపయోగ పడే స్టౌ తయారు చేసే ఆలోచన ఇతనికి విచిత్రంగా వచ్చింది. చాలా తక్కువ కట్టెలు వాడి, అద్భుతంగా పని చేసే ఒక స్టౌకు రూపకల్పన చేసి, దానిని 2013లో రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శిస్తూ వుండగా, తాను స్టౌ పెట్టిన టేబులు చాలా వేడెక్కడం గమనించాడు. స్టౌ క్రింది భాగం నుంచి వచ్చే వేడి కారణంగా టేబుల్ మాడిపోయింది. ఇంత వేడిని వృధాగా పోనీయకుండా, దీనిని ఏదోవిధంగా ఉపయోగించుకోవచ్చు అన్న ఆలోచన కలిగి ప్రదర్శన చూడటానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతునే మనసులో తమ మణిపూర్‌లో చేపలు, మాంసము, కాయగూరలు ఎండబెట్టి, ఒరుగులు చేయటానికి ఈ వేడిని సమర్థవంతంగా వాడుకోవచ్చు కదా అని ప్రణాళిక వేసుకున్నాడు.

నాగాలాండ్, మణిపూర్ ప్రాంతాలలో గాడి పొయ్యిలను త్రవ్వి, ఆ వేడిలోనే వారికి చాలా ఇష్టమైన చేపలు, మాంసము, కూరగాయలను ఎండబెట్టుకుంటారు. ఆవిధంగా ఎండిన ఈ పదార్థాలకు పొగవాసన చేరటం వల్ల వాటి రుచికి ఇష్టపడి అక్కడి ప్రజలు వీటిని చాలా మక్కువతో తింటారు. గ్యాస్ స్టౌలు వాడకంలోకి రావటంతో ఈవిధంగా తినే పదార్థాలను ఎండబెట్టే ప్రక్రియ తగ్గిపోయింది. పాత పద్ధతిని పునరుద్ధరించటానికి దేబేన్ కట్టె బొగ్గును వాడి, పొయ్యి క్రిందుగా కొన్ని అరలు ఏర్పాటు చేసి, వాటిలో పదార్థాలను ఎండబెట్టే వెసులుబాటు కల్పించాడు. ఈ పద్ధతిలో పైన వంట పని జరుగుతూ వుండగానే క్రింద అరలలో పదార్థాలు ఎండుతూ వుంటాయి. మొత్తం స్టౌ భూమినుంచి 75 సెంటీమీటర్ల ఎత్తు వుంటుంది. 60 సెం.మీ. వెడల్పు, 90 సెం.మీ. పొడవు వుండి, ఒక స్టాండుమీద ఏర్పాటు చేయటంతో వంట చేసే వ్యక్తి నిలబడే చేసుకోవచ్చు. రెండు స్టౌలు ఏర్పాటు చేయటం వల్ల రెండు పదార్థాలను ఒకసారి చేసుకోవచ్చు.

చాలా తక్కువ పొగ వచ్చే ఈ స్టౌలో వంట త్వరగా అవటమే కాక, స్టౌ క్రింద అరలలోనున్న పదార్థాలు కూడా త్వరగా ఎండిపోతాయి. నాణ్యమైన లోహపు రేకులు మరియు అల్యూమినియంతో ఈ పొయ్యిని తయారు చేయటంతో త్వరగా వేడెక్కి వంట త్వరగా తయారవటమే కాకుండా, గదిని కూడా వెచ్చగా ఉంచటానికి తోడ్పడుతుంది.

ఐఐఐటి మణిపూర్‌లో ఈ స్టౌని పరీక్షించి, మామూలు బొగ్గు పొయ్యిలలోకన్నా దీనిలో వేడి వృధా అయ్యే అవకాశం లేనందున, పది శాతం ఎక్కువ సమర్థతతో పని చేస్తుంది అని




నిర్ధారించారు. పొయ్యి లోపల గాలి పారడాన్ని నియంత్రించుట వలన వండే పదార్థానికి అవసరమైన వేడిని నియంత్రించుకో వచ్చు. దీనివలన ఇంధనం ఆదా అవుతుంది. గాలి సులువుగా పారటం కొరకు చిన్న ఎలక్ట్రిక్ ఫ్యాన్‌ను కూడా బిగించడం జరిగింది. ఐఐఐటి మణిపూర్ వారు ఈ పొయ్యి ఇంకా సమర్థవంతంగా పని చేయటానికి కొన్ని సూచనలు చేయటం జరిగింది. ఈ రకమైన పొయ్యిలలో ఇది ఉత్తమమైనదిగా ప్రాచుర్యం పొందింది.

గత కొద్ది సంవత్సరాలుగా దేబేన్ ఈ పొయ్యిని ప్రాంతీయ, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో అనేక ప్రదర్శనలలో ప్రదర్శించి, ప్రజల మన్ననలు, ప్రశంసలే కాక, అనేక పురస్కారాలు కూడా అందుకున్నాడు. మణిపూర్ ప్రభుత్వానికి చెందిన పరిశ్రమలు – వాణిజ్య శాఖవారు ఇతనికి 'శాశ్విత ప్రాతిపదికన కొంత స్థలము, ఒక షెడ్డు, నిరంతర విద్యుత్తు సరఫరా కల్పించి, ఇతని ఉత్పత్తులను మెరుగుపర్చుకోవటానికి ఎంతో దోహదపడ్డారు'. ఎన్.ఐ.ఎఫ్. వారు కూడా తమ ఎన్.వి.ఐ.ఎఫ్. నిధిలోనుండి ఆర్థిక సహాయమందించి, ఈ పొయ్యిని ఇంకా సమర్థవంతంగా పనిచేసేలా చెయ్యటానికి తనవంతు తోడ్పాటు అందించారు. ఈ స్టౌను అతని పేరుతో పేటెంటు చేయించటమే కాక, దీనికి అధిక ప్రాచుర్యం కల్పించటానికి ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తోంది. ప్రభుత్వ సహాయంతో వర్క్‌షాప్ ప్రారంభించిన దేబేన్ కుతూహలమున్న యువతకు తమ నైపుణ్యాన్ని పెంచుకొని, ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడటానికి వారివారి స్వంత వ్యాపారాలు ప్రారంభించుకోవటానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తూ వుంటారు.

ఎన్.ఐ.ఎఫ్. వారు 2017లో 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో మెకానికల్ విభాగంలో రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. ●

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/–లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.



గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని ఆశిస్తున్నాము.

– ఎడిటర్

మీ చందాను పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు :
M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023
జమ చేసిన తర్వాత మీ చిరునామాను స్పష్టంగా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org   Visit us : www.pallesrujana.org



## అవసరాలే ఇన్నోవేటర్‌గా మార్చిన 'సయ్యద్ ఇస్మాయిల్' రూపకల్పన

# మొబైల్ పంక్చర్ షాప్

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

గుడివాడ పట్టణంలో గల లారీలు, ట్రాక్టర్లు, ఇతర చిన్న చిన్న సరుకులు చేరవేసే వాహనాలు (గూడ్స్ వెహికల్స్) వారు తమ వాహనం పంక్చర్ అయితే టైర్లను విప్పదీసుకుని, ఎంతో దూరం వెళ్ళి పంక్చర్ చేయించుకుని వచ్చి మళ్ళీ తమ వాహనాన్ని నడుపుకుంటూ వెళ్ళే ఇబ్బందుల నుండి ఉపశమనం కలిగించాడు గుడివాడ నివాసి 35 సంవత్సరాల 'ఇస్మాయిల్ జలీల్'. ఇతను ఏమీ చదువుకోలేదు, భార్య, ఒక కూతురు, ఒక కొడుకు వున్నారు. తండ్రి లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు.

ఇతను ఒక సాధారణ దిగువ తరగతి వ్యక్తి. ప్రతిరోజూ వాహనాల టైర్లకు పంచర్లు వేస్తూ జీవనం సాగించటం ఇతని వృత్తి. మామూలుగా పంచర్ వేసే పరికరాలను ఒకచోట పెట్టుకుని, గిరాకీ ఎవరు వస్తారా అని ఎదురు చూస్తూ వుంటారు. ఇస్మాయిల్ కూడా పది సంవత్సరాల క్రితం పంచర్ షాపు ఏర్పాటు చేసుకుని అలాగే తన పంచర్ షాపును నడిపాడు. కానీ, తన కుటుంబ అవసరాలకు సరిపడా ఆదాయం రావటం లేదు, తనకు మరో వృత్తిలో వెళ్ళే ఆలోచన లేదు. ఇందులోనే ఒక కొత్తదనాన్ని చూసుకుని ఆదాయ మార్గాన్ని పెంచుకోవాలి అని ఆలోచించాడు. ఆ ఆలోచనల్లోంచి వచ్చిందే ఇతను స్వయంగా రూపొందించుకున్న 'మొబైల్ పంచర్ షాప్'. నాలుగు సంవత్సరాల క్రితం ఈ మొబైల్ పంచర్ షాప్‌ను ఏర్పాటు చేసుకున్నాడు.

తనకున్న పరిజ్ఞానం మేరకు తనవద్ద వున్న డబ్బుకు తోడు స్నేహితుల వద్ద కొంత అప్పు చేసి ఒక పాత టాటా ఏస్ బండిని తక్కువ ధరకు కొన్నాడు. ఆ వాహనంలోనే ఇతని గాలి నింపే యంత్రాన్ని ఏర్పాటు చేసుకుని, అది తిరగటానికి మరో డీజిల్ ఇంజన్ ఏర్పాటు చేసుకుంటే దాని ఖరీదు ఎక్కువ అవుతుందని తను కొన్న టాటా ఏస్ వాహనం వెనక టైర్లలో ఒకదానికి పైన వాహనం యొక్క బాడీకి బెల్టు దూరేలా రంధ్రం చేసి, గాలి నింపే యంత్రం యొక్క బెల్ట్‌ను అమర్చి తిరిగేలా చేశాడు. అంటే ఎటువంటి అదనపు మరమ్మత్తులు లేకుండా



మామూలుగా కరెంటు మోటారుకు, గాలిమరకు అనుసంధానం చేసే బెల్టు బదులు తన వాహనం టైరుకు, గాలిమరకు అనుసంధానం చేసి ఒక పెద్ద సైజు బెల్ట్‌తో తిరిగేలా ఏర్పాటు చేసుకున్నాడు.

ఈ ఏర్పాటు చేయటానికి ముందు గాలిమర నడవటానికి ఒక డీజిల్ ఇంజన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే పట్టణంలో ఆ ఇంజన్ ఆన్ చేసినపుడు చాలామంది శబ్ద కాలుష్యం, పొగ కాలుష్యం అని ఫిర్యాదులు రావటంతో ఈ ఆలోచన వచ్చింది ఇతనికి. అంటే కొందరి అసహనం కూడా ఇతనిలో సృజనాత్మకతను పెంచటంతో పాటు, ఇప్పుడితని ఖర్చు కూడా చాలావరకు తగ్గిపోయింది. డీజిల్ ఇంజనైతే దాన్ని స్టార్ట్ చేయటానికి అవసరం అనుకున్నపుడల్లా దాన్ని హ్యాండిల్‌తో తిప్పాలి. ఇప్పుడా అవసరం లేదు. వాహనం వెనక టైర్లను జాకీతో పైకి ఎత్తుతాడు, వాహనం స్టార్ట్ చేసి గేరు వేస్తే చాలు గాలిమర నడుస్తునే వుంటుంది.

ఇప్పుడు సౌండ్ పొల్యూషన్ ఏమీ వుండదు, కేవలం కారు రన్నింగ్‌లో వున్న సౌండు వల్ల ఎవరికీ ఇబ్బంది ఉండదు, పైగా పని కూడా అప్పటికన్నా త్వరగా పూర్తవుతుంది అంటాడు సయ్యద్ ఇస్మాయిల్. గాలిమర పని చేయాలనుకున్నపుడు వాహనం వెనక టైరును 'జాకీ'తో కాస్త పైకి ఎత్తిపెట్టి, వాహనం ఇంజన్ స్టార్ట్ చేసి గేరు వేస్తే వెనక టైర్లు తిరుగుతూ వుంటాయి, ఆ టైరుకు తగిలించిన బెల్టు సహాయంతో వాహనంలోని గాలిమర కూడా తిరుగుతూ సిలిండర్‌లోకి గాలిని నింపుకుంటుంది

ఈ ఆలోచన నీకెలా వచ్చింది అని అడిగినపుడు, ఈ గాలి యంత్రం నడపాలంటే 3 ఫేస్‌ల కరెంటు కావాలి, వెళ్ళిన చోటల్లా కరెంటు వుండదు, జనరేటర్ వేస్తేనేమో శబ్ద కాలుష్యం వల్ల చాలామంది ఇబ్బంది పడతారు కాబట్టి ఈవిధంగా ఏర్పాటు చేసుకున్నాను. నేను డ్రైవర్‌గా కొన్నిరోజులు పని చేశాను, ప్రస్తుతం లారీలకు క్లీనర్‌లు కూడా సరిగ్గా లభించటం లేదు. వచ్చిన క్లీనర్ కూడా టైరును ఎక్కడికో తోసుకుని వెళ్ళి పంచర్ వేయించుకుని వచ్చేంత శక్తి, సామర్థ్యం గల వాళ్ళు లభించక లారీ యజమానును ఇబ్బంది పడుతున్నారు. ఇవన్నీ కలిపిన ఆలోచనతో నా లారీకి ఒక చిన్నపాటి బెజ్జం వేసి, కంప్రెషర్‌ను వెనక టైరుకు సమాంతరంగా ఏర్పాటు చేసుకుని బెల్టు ఎక్కిస్తే సరిపోతుంది. కరెంటు మోటారుకన్నా శక్తితో ఇది తిరుగుతుందని అనిపించి వెంటనే అమలు చేశాడు. తాను అనుకున్నది అనుకున్నట్లు గానే కంప్రెషర్ పనిచేయటం ప్రారంభించింది. దీన్ని టైరుకు, సమాంతరంగా ఏర్పాటు చేస్తే వాహనాన్ని ఎంతసేపు నడిపించినా, బెల్టు పడిపోదు అంటాడతను.

కేవలం ఒక సహాయకారిని ఉద్యోగిగా ఏర్పాటు చేసుకుని గుడివాడ పట్టణానికి 5–10 కి.మీ. పరిధిలో ఎక్కడ పంచర్ అయినా సరే అక్కడికి వెళ్ళి వారి పని పూర్తి చేసుకుని తగిన ప్రతిఫలం తీసుకుని వస్తూ వుంటాడు. .

సయ్యద్ ఇస్మాయిల్ ఇతర సామాగ్రి కొరకు ఎక్కడికీ వెళ్ళ వలసిన అవసరం లేకుండా ఆ వాహనానికే పంచర్





చేయటానికి కావలసిన అన్ని అమర్చుకున్నాడు. ఆఖరుకు ట్యూబ్ ఎక్కడ పంచర్ అయిందో చూసుకోవటానికి నీటిని కూడా వాహనానికి ఒకవైపున ఒక పాత ట్యూబును తగిలించి, అందులో నీరు నింపి వుంచుతాడు. దాని నుండి కావలసిన నీటిని ఒక పాత్రలో తీసుకుని ట్యూబు ఎక్కడ పంచర్ అయిందో చూసుకుని వెంటనే పంచర్ వేసేస్తాడు.

గుడివాడ పట్టణం చుట్టు ప్రక్కల ఎక్కడ భారీ వాహనాలు పంచర్ అయినా సరే ఇతనికి ఫోన్ చేస్తే చాలు వెంటనే అక్కడికి చేరి పంచర్ వేసేసి వస్తూ వుంటాడు. దీనివల్ల రహదారుల్లో పయనించే ట్రక్ డ్రైవర్లకు ఎంతో హాయిగా ఉంది. వారు ఇస్మాయిల్‌కి ఎంతో కృతజ్ఞత తెలుపుతున్నారు.

ఈ వాహనం తయారు చేసుకోవటానికి ముందు కూరగాయల వ్యాపారుల్లా నాలుగు చక్రాల తోపుడు బండిపైన ఇవన్నీ ఏర్పాటు చేసుకుని ఒక సంవత్సరం పాటు పట్టణంలో అక్కడక్కడా తిరుగుతూ పంచర్లు వేసుకునేవాడు సయ్యద్ ఇస్మాయిల్. ఈ తోపుడు బండివల్ల పనులు త్వరగా జరగవని గ్రహించి ఇన్నోవేటర్ ఈ వాహనాన్ని తయారు చేసి ఇప్పుడు నగరం చుట్టుప్రక్కల ఎక్కడ వాహనం పంచరైనా సరే ఇతనికే ఫోన్ వచ్చేంతగా ప్రచారం జరిగిపోయింది. ప్రస్తుతం తన ఆదాయం సంతృప్తికరంగా వుందని, ముఖ్యంగా యజమానులు, డ్రైవర్లు ఎంతో సంతోషంగా తన పనిని మెచ్చుకుంటున్నారని, కొందరు సహృదయులైతే తాను అడిగినదానికన్నా ఎక్కువ మొత్తమే ఇస్తూ వుంటారని, ప్రస్తుతం తనకెంతో ఆనందంగా వుందని అంటాడు సయ్యద్ ఇస్మాయిల్.

ఇప్పుడు పంచర్ వేయాలనుకున్నపుడు తన వాహనం వెనక టైర్లు జాకీతో పైకి లేపి వాహనాన్ని స్టార్ట్ చేసుకుని పని చేయటం వల్ల కొద్దిగా శ్రమ అనిపిస్తుందని, ఈ శ్రమ కూడా లేకుండా చేసుకోవాలన్న ఆలోచన కూడా వుందంటాడు. కాని అలా చేయాలంటే ఒక లక్ష రూపాయల వరకు ఖర్చవుతుందని, అప్పుడు ఇక తన వాహనాన్ని స్టార్ట్ చేసి గేరు వేయాల్సిన పనిలేదని, కేవలం బండి స్టార్ట్ చేసుకుని, న్యూట్రల్ గేర్‌లో వుంచుకుంటూనే గాలిమర నడిపేలా ఏర్పాటు చేసుకోవచ్చుట. ఇప్పుడు ఒకరు లేదా ఇద్దరు సహాయకులను పోషించాల్సి వస్తోందని, ఇది ఏర్పాటు చేసుకుంటే నేనొక్కన్ని లేదా ఒకరిని సహాయకారిగా పెట్టుకున్నా సరిపోతుందని అంటాడు ఇస్మాయిల్.

మొత్తానికి అవసరాలు మనిషిని ఇన్నోవేటర్‌ను చేస్తాయి అని మరోసారి నిరూపించాడు గుడివాడకు చెందిన సయ్యద్ ఇస్మాయిల్. ఇతని పనితనానికి 'పల్లెసృజన' మనస్ఫూర్తిగా అభినందిస్తూ, అవసరమైన సహాయం అందించటానికి కృషి చేస్తామని చెప్పటం జరిగింది.

గుడివాడ సమీపంలో గల రహదారుల్లో ప్రయాణించే వాహన చోదకులు ఇలాంటి ఇబ్బందులు వస్తే వెంటనే ఇన్నోవేటర్ ఇస్మాయిల్‌ను ఫోన్ నెం. 9908065689 ను సంప్రదిస్తే చాలు వెంటనే మీ చెంతకు చేరి మీ సమస్యను పరిష్కరించి మీ ప్రయాణాన్ని సుఖవంతం చేస్తాడు.





# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 12 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 12వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2021** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా **'పల్లెసృజన'** కార్యాలయాన్ని **(ఫోన్ : 040-27111959)** సంప్రదించండి.

# గుజరాత్ రాష్ట్రం నుండి సేకరించిన పల్లె కబుర్లు

લોકસરવાણી
*Loksarvani*
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

21101

**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**

పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధపడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు దొరుకుతున్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.



21102

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు



చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు. ఈయన చాలాకాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మి.లీ. ఆ కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని చెపుతున్నాడు.

21103

**వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి :**

గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పురుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002-2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 80 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యధికంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడటానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తున్నారు. దాన్ని పురుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.



ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండుమూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.

21104

**మిరప పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి :**

గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటిలో కలిపి మరిగిస్తాడు. 250 మి.లీ. ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తాడు. ఈ పద్ధతి వలన మిరప పంటలో 80 శాతం వరకు తెగుళ్ళను నివారించగలిగానని చెపుతున్నాడు.

21107

**వరి, మినుము పంటలలో చీడల నివారణకు :**

వరి మినుము పంటలను చీడలు సోకి చాలా నష్టాన్ని కలిగిస్తుంటాయి. దీని నివారణకు అనేక ఖరీదైన రసాయన పద్ధతులు వాడినా స్వచ్ఛమైన సేంద్రియ పద్ధతి ఒకటి వుంది అంటున్నారు గుజరాత్ రాష్ట్రం లోని బనస్కాంత ప్రాంతానికి చెందిన 'జమాల్ భాయ్ నూరాభాయ్ మోడీ'. ఈయన పులికంప చెట్టు ఆకులు, పొగాకు, రేలకాయలు (రోడ్ల పక్కలో విరివిగా లభించే నల్లని పొడగాటి కాయలు, ఈ చెట్ల పూత పసుపు వర్ణంలో వుంటుంది) ను కలిపి తయారు



చేసుకుంటాడు. రెండు లీటర్ల ద్రావకం తయారు చేసుకోవటానికి ఆయన 200 గ్రా. పులికంప ఆకులు మరియు పూలు, 200 గ్రా. పొగాకు చెట్లు వేర్ల పొడి, 200 గ్రా. రేల కాయల పొడిని మూడు లీటర్ల నీటిలో కలిపి ద్రావకం 2 లీటర్లు అయ్యేంత వరకు మరగబెట్టాలి. ఈ కషాయాన్ని నీటిలో కలిపి పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితముంటుంది.

**బెండ పంటను చీడ పీడల నుండి కాపాడటానికి:**

గుజరాత్ రాష్ట్రంలోని సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, మాయానగర్ గ్రామ నివాసి 'జనక్ కుమార్ వ్రజిలాల్ చోహాన్' తన బెండ పంటను చీడ పీడలనుంచి కాపాడటానికి స్వయంగా ఓ పద్ధతిని కనుగొన్నాడు. ఈయన మెంతుల పొడిని ఉపయోగించి, ఒక ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఇది వాడటం వలన మంచి ఫలితం



వుంటుంది అని చెపుతున్నారాయన. దీనికై ఆయన మెంతులను మెత్తగా నూరి పొడి చేసుకుని, ఒక కిలో పొడిని నీటిలో కలిపి మూడు రోజులపాటు మురగనిస్తాడు. మూడు రోజుల తర్వాత ఈ పొడి కొంత చిక్కగా, జిగురుగా మారుతుంది. ఆ చిక్కటి ద్రావకాన్ని మెత్తని చీపురుతో పంటపై చిలకరిస్తాడు. ఈ మెంతులకి వున్న ప్రత్యేకమైన వాసన చీడపీడలను, పురుగులను మొక్కల దగ్గరికి రానీయదు.

**ఆకుముడత పురుగు నివారణకు:**

చాలా రకాల పంటలలో ఆకుముడత తెగులు పంటకు ఎంతో నష్టాన్ని చేకూరుస్తుంది. ఈ తెగులు ప్రత్యేకించి, చలికాలం, మేఘావృతమైనప్పుడు ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు గుజరాత్ రాష్ట్రం, సురేంద్రనగర్ జిల్లా, హన్వాడ్ తాలూకా, దేవీపూర్ గ్రామ నివాసి 'మహేష్ భాయ్ జయరామ్ భాయ్ లఖాత్రియా' గన్నేరు చెట్లను ఆశ్రయిస్తాడు. ఇది పూర్తి సేంద్రియ పద్ధతే అని చెపుతాడాయన. ఆయన రెండు కిలోల గన్నేరు ఆకులను తీసుకుని, మెత్తగా నూరి ముద్దచేసి, ఆ ముద్దను 5 లీటర్ల నీటిలో కలిపి ఐదారు రోజులపాటు మురగబెట్టాడు. తర్వాత ఈ ద్రావకాన్ని కొద్దిసేపు మరిగించి, 150 మి.లీ. ఈ మరిగించిన ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి పంటపై ఆకులు క్రింద భాగానికి తగిలేలా పిచికారి చేస్తాడు. దీంతో ఆకుముడత తెగులు సమర్థవంతంగా అరికట్ట బడుతుంది అంటారు. ఈ ద్రావకాన్ని మురగబెట్టేటపుడు గాలి పారకుండా మూత పెడితే త్వరగా మురిగిపోతుందట. ఈద్రావకం బూజు తెగులుకు కూడా బాగా పనిచేస్తుంది అంటారాయన. ●



# జ్ఞానయజ్ఞం

## పల్లె జ్ఞానాన్ని మీ గ్రామాలకూ అందించండి


**"నలుగురికి మేలు చేయండి, మీకూ మేలు జరుగుతుంది" అని పెద్దలు చెపుతూ వుంటారు. నలుగురికీ పనికివచ్చే పని చేస్తే వారికి మేలేమో కాని, ఎంత సంతృప్తి మనకు మిగులుతుందో చేసిన వారికే తెలుస్తుంది.**

ఇప్పుడు 'పల్లెసృజన' నలుగురికి కాదు, నలభై మందికీ కాదు, నాలుగు వందల మందికి మేలు చేసే మార్గం, అవకాశం మీకు కల్పిస్తోంది. పర్వదినాలకి, పుట్టిన రోజులకి, వివాహాలకి మమ్మల్ని గుర్తుంచుకోండి అని ఏదో ఒక బహుమానం ఇవ్వటం మన ఆచారం. అదే బహుమానం ఇచ్చిన వారికే కాక, సమాజానికి కూడా ఉపయోగ పడితే, ఆ ఆనందం మనకు ద్విగుణీకృత మవుతుంది. ఆ తృప్తికి మనకు అవధులు వుండవు.

మేము కోరేదల్లా మీరు పుట్టినరోజులు, వివాహ దినోత్సవాలు లాంటి పర్వదినాల్లో మీ మిత్రులకి మీ పేరుమీద వారికి పల్లెసృజన సభ్యత్వం కల్పించండి. ఇంకొంచెం కొత్తగా ఆలోచిస్తే....! మీరు పల్లెసృజన సభ్యత్వాన్ని మీ గ్రామ పంచాయితీ పేరున ఇవ్వండి!! మీ మిత్రుల సొంత ఊర్లలోని గ్రామ పంచాయితీల పేరున ఇవ్వమని వారిని కూడా ప్రోత్సహించండి!!! మీ కారణంగా అక్కడి ప్రజలు ఎంతోమంది గ్రామీణ ఇన్నోవేషన్లను గురించి తెలుసుకుంటారు. మీ మరియు మీ మిత్రుల గ్రామాలను జ్ఞానంతో కనెక్ట్ చేసినవారవుతారు. అప్పుడు మీకు కలిగే తృప్తిని గురించి ఆలోచించండి. మీరు చేసిన ఈ చిన్న ఖర్చుకి మీకెంత ఫలితం వచ్చిందో మీకే తెలుస్తుంది. ఒక గ్రామానికి కేవలం రూ. 1,000ల సభ్యత్వం చెల్లిస్తే 5 సంవత్సరాల పాటు వారికి కొత్తరకం జ్ఞానాన్ని, మీ గ్రామంలో ఎవరైనా ఇలాంటి ఇన్నోవేటర్లు వుంటే వారికి ఉజ్వల భవిష్యత్తును అందించిన వారవుతారు. ఒక్కసారి ఆలోచించరా దయచేసి. చందా వివరాలు ఈ సంచిక వెనక పేజీలో ఇవ్వబడ్డాయి.

ఈ కార్యక్రమాన్ని వెంటనే అమలు చేయండి, మన గ్రామీణ ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు వచ్చి, దేశాభ్యుదయానికి తోడ్పడండి. మన తెలుగు రాష్ట్రాల్లోని 30 వేల గ్రామాలను 'పల్లెజ్ఞానం' తో అనుసంధానం (కనెక్ట్)చేయండి. ఇలా చేయటం వల్ల మన స్వదేశీ ఇన్నోవేషన్లు, రైతుల కొరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు విరివిగా ప్రచారంలోకి వచ్చి, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు మీరూ సహకరించిన వారవుతారు. సభ్యత్వ వివరాలు ఈ సంచిక వెనక కవర్ పేజీపైన ముద్రించబడినవి.

**- ఎడిటర్.**



# ఉమామహేశ్వర రావు ఆయుర్వేద జ్ఞాన మధనం
# 'బొప్పాయి' పరమ ఔషధము

బొప్పాయి చెట్టును బాగా పరిశీలించి చూడండి, ఈ చెట్టు క్రింద మొలిచిన మొక్కలు దివ్య తేజస్సుతో వుంటాయి. అందుకే బొప్పాయి తోటల్లో అంతర పంటలు వేస్తే అవి మంచి ఫలాన్నిస్తాయి. ఎందుకంటే ఈ బొప్పాయి చెట్టులో వున్న ఔషధ గుణాలు అన్ని రకాల పోషకాలు వుండటం వల్ల వాటిని క్రిందవున్న చెట్లు తీసుకుని ఆరోగ్యంగా పెరుగుతాయి. మామూలుగా ఇతర చెట్ల నీడలో ఏ పంట పండదు, కాని బొప్పాయి తోటలో నీడ వున్నా సరే పంటలు అద్భుతంగా పండుతాయి. బొప్పాయి పండు మానవ శరీరానికి కూడా చాలా మంచి మందు. కొంతమందికి ఈ పండుపైన కొన్ని దురభిప్రాయాలు ఉన్నాయి. అందులో మొదటిది గర్భిణీ స్త్రీలు ఈ పండు తింటే గర్భస్రావం అవుతుంది అని. గర్భిణీ స్త్రీలు మొదటి 5 నెలల వరకు తినకుండా వుండటం మంచిదే, ఎందుకంటే ఈ పండులో కొంత వేడి చేసే గుణం వుంది. కాబట్టి గర్భస్రావం అయ్యే ప్రమాదముంది. అంతేకాని, ఈ పండును తింటే ఖచ్చితంగా గర్భస్రావం అవుతుంది అనేదాన్ని పూర్తిగా విశ్వసించలేము. గర్భిణీలు 5-6 నెలల తర్వాత బాగా మాగిన పండు తింటే మంచిదే. ఇక ఇతరుల విషయానికి వస్తే....



బొప్పాయి పండు శరీరానికి బలవర్ధకమైన ఆహారం. బొప్పాయిలో ఫైబర్, కిరటిన్, విటమిన్-సి, ఎంజైములు లాంటి ఎన్నో మంచి గుణాలున్నాయి. ముఖ్యంగా గుండెకు మంచి టానిక్ లాంటిది. రోజూ బొప్పాయి తినటం వల్ల గుండెపోటుకు దూరంగా వుండవచ్చు. ఇందులో వున్న మంచి గుణాల వల్ల గుండెకు సంబంధించిన వాల్వ్‌లను ఆరోగ్యంగా వుంచుతుంది. చర్మవ్యాధులు రాకుండా చేసే గుణం బొప్పాయిలో వుంది. బొప్పాయిలో పొటాషియం, విటమిన్-ఎ ఎక్కువగా వుండటం వల్ల చర్మానికి సంబంధించిన రోగాలను దరిచేరనివ్వదు. బొప్పాయి తినటం వల్ల కొవ్వు పదార్థాలు మానవ శరీరానికి కావలసినంత మాత్రమే వుంచి మిగతా క్రొవ్వును కరిగించివేస్తుంది.

బొప్పాయి ఆకులను 'గజ్జి, తామర' లాంటి వ్యాధులకు పైపూతగా వాడవచ్చు. విరోచనం సరిగ్గా రానివాళ్ళు రోజు 4 ముక్కలు బొప్పాయి పండు తింటే విరోచనం సాఫీగా జరుగుతుంది, మంచి అరుగుదల కూడా ఉంటుంది. బొప్పాయి పండుని రసం చేసుకుని త్రాగటం వల్ల శరీరంలో, ముఖ్యంగా పొట్టలో ఎటువంటి ఇన్‌ఫెక్షన్‌లు ఉండవు. కీళ్ళ నొప్పులు ఉన్నవారు కూడా బొప్పాయిని తీసుకుంటే తగ్గే అవకాశముంది.

బొప్పాయి పండు పై తొక్కలు పారవేయకుండా వాటిని మెత్తగా దంచి పేస్టులాగా చేసుకుని, తలపై బాగా పట్టించుకుని ఒక గంట తర్వాత కుంకుడు కాయతో స్నానం చేసినట్లయితే తలలో చుండ్రు ఉండదు.

రుతుస్రావం క్రమంగా జరగని మహిళలు బొప్పాయి కాయలను కూరగా వండుకుని తిన్నట్లయితే అటువంటి సమస్యలు ఉండవు. అంతేకాక చంటి పిల్లలున్న మహిలలు పిల్లలకు పాలు సరిగ్గా సరిపోవటం లేదు అనుకుంటే ఈ బొప్పాయి కాయ కూరను తింటే పుష్కలంగా పాలు వస్తాయి.

రక్తంలో తెల్ల రక్త కణాలు తగ్గిపోయి అనారోగ్యం పాలవుతున్నవారు బొప్పాయి చెట్టు ఆకులను రసంగా చేసుకుని రోజూ ఉదయం, సాయంత్రం టీకప్పులో సగం రసం నాలుగు



రోజులపాటు తీసుకున్నట్లయితే తెల్ల రక్త కణాల పెరుగుదల గణనీయంగా వుంటుంది.

బొప్పాయి చెట్టు ఆకులను నీళ్ళలో వేసి అవి సగం అయ్యేవరకు వేడి చేసి కషాయం తయారు చేసుకుని రోజూ అర గ్లాసు చొప్పున 4 రోజుల పాటు తీసుకున్నట్లయితే గ్యాస్, జ్వరం, దగ్గు వున్నవారికి వాటినుండి త్వరగా ఉపశమనం కలుగుతుంది.

పిత్తాశయం (గాల్ బ్లాడర్) లో రాళ్ళు వున్నవారు అవి కరగటానికి బొప్పాయి పండులో వున్న గింజలు ఎండబెట్టుకొని



రోజూ ఉదయం, సాయంత్రం ఒక స్పూను తిని, పైనాపిల్ జ్యూస్ తాగినట్లయితే పిత్తాశయంలోని రాళ్ళు కరిగిపోతాయి. క్యాన్సర్ రోజులకు కూడా బొప్పాయి పండు దివ్య ఔషధము. రోజూ బొప్పాయి తినటం వల్ల క్యాన్సర్ రోగులకున్న నొప్పులు తగ్గుముఖం పడతాయి.

బొప్పాయిలో ఆడ, మగ అనే రెండు రకాల చెట్లుంటాయి. మగ చెట్టు కాయలు కాయదు. దీనికి తీగలు తీగలు, గుత్తులు గుత్తులుగా పూలు పూస్తూ వుంటాయి. ఆ తీగలను తెంపినట్లయితే చెట్టునుండి పాలు కరుతాయి. ఆ పాలను తలలో పేను కొరికి, జుట్టు రాకుండా వున్నచోట పూస్తే జుట్టు త్వరగా వస్తుంది. బట్టతల వున్న 30 సంవత్సరాలు దాటని యువకులు కూడా ఈ పాలను తలపైన పూసుకుని ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే జుట్టు వచ్చే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. తర్వాత అదే చెట్టు పాలను బోదెకాలు వున్నవారు బోదె కాలుపైన పూసి, అదే చెట్టు ఆకులను కాలుచుట్టూ పెట్టి కట్టు కట్టుకుని రోజూ ఒక గంటసేపు వుంటే బోదె కాలు వాపు త్వరగా తగ్గిపోతుంది.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

**ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854**

**గణేశం గారికి,**

నాకు ఈమధ్య ఒక మిత్రుని వద్ద రెండు 'పల్లెసృజన' పత్రికలను చదివే భాగ్యం కలిగింది. ఎటువంటి వ్యాపార ప్రకటనలు, హాస్య కథలు, రాజకీయ, ఇతరత్రా వార్తలు లేకుండా కేవలం 'ఇన్నోవేషన్ల'మీదనే పత్రిక మొత్తం ముద్రించటం చూసి ఎంతో ముచ్చటేసింది. ఇన్ని ఇన్నోవేషన్లు మన గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తులు తయారు చేస్తున్నారా అని ఆశ్చర్యం కూడా వేసింది. మీరు చేస్తున్న పనిని అభినందించకుండా ఉండలేక పోతున్నాను. వీలు చూసుకుని మీవద్దకు వచ్చి నేను కూడా స్వచ్ఛందంగా రోజూ కొంతసేపు పని చేయాలన్నంత ఉత్సాహంగా ఉన్నాను. త్వరలో మిమ్ములను ప్రత్యక్షంగా కలుసుకొని నాకు చేతనైనంత సహకారం అందిస్తానని మనస్ఫూర్తిగా తెలియజేస్తున్నాను.

**– డా. బాపూజీ,** రిటైర్డు సైంటిస్ట్, హైదరాబాద్.

బాపూజీ గారూ,

మీలాంటి వాళ్ళ చేతికి 'పల్లెసృజన' పత్రిక చేరటం మాకు సంతోషకరమైన విషయం. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీరు ఎప్పుడు వచ్చినా పల్లెసృజన స్వాగతం పలుకుతుంది. మీ సహాయం మా పనిని ద్విగుణీకృతం చేస్తుంది.

**– బ్రిగేడియర్ పోగుల గణేశం**

**ఎడిటర్ గారికి,**

'పల్లెసృజన' పత్రికను నేను క్రమం తప్పకుండా చూస్తూ వుంటాను. రైతాంగం కొరకు ఎన్నో రకాల ఇన్నోవేషన్‌లు, పెట్టుబడి ఖర్చు తగ్గే వ్యవసాయ పద్ధతులపై మీకున్న అవగాహనను, ఇది ప్రతి రైతు పాటించాలనే మీ తపన నన్నెంతగానో ఆకట్టుకుంది. కానీ, ఈ వివరాలను కేవలం పత్రికలో ముద్రించి, రైతాంగానికి సూచన వెళ్ళింది అనుకోకుండా ఈ పద్ధతులను ప్రభుత్వాల వద్ద చర్చించి వారిచేత అమలు జరిగేలా చేస్తే యావత్ రైతాంగానికి చేరుతుందని నా ఆలోచన. 'పల్లెసృజన'కు ఇప్పటికే వున్న పలుకుబడి కారణంగా ప్రభుత్వాలు కూడా మీ సలహాలకు సహృదయంతో స్వీకరించి ఆచరణలో పెడుతుందని నా అభిప్రాయం. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏర్పడిన నూతన ప్రభుత్వాలు కూడా వ్యవసాయంపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి. ఇటువంటి ఖర్చులేని, దిగుబడి పెరిగి, రైతుకు లాభాలను చేకూర్చే పద్ధతులను మీ ద్వారానే రైతాంగానికి చేరేందుకు ప్రత్యేకత శ్రద్ధ తీసుకుంటాయని నాకనిపిస్తోంది. ఆలోచించి వీలైతే ఆచరిస్తారని ఆశిస్తాను.

**– సిద్ధార్థ నాయక్, రాజస్థాన్**

**సిద్ధార్థ గారూ,**

మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ సూచనలను అభినందిస్తున్నాము. పల్లెసృజన సిద్ధాంతాలను, గ్రామీణ ఇన్నోవేషన్లను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల ద్వారా ప్రతి గ్రామానికి చేరేందుకు తప్పకుండా ప్రయత్నిస్తాము. **– ఎడిటర్.**


**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to,be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

**I, P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

# ఆచార్య 'కె.ఎల్. ఘుగ్'గారికి స్మృత్యాంజలి



## కీ.శే. ఆచార్య 'కె.ఎల్. ఘుగ్' గారు

ఐదు సంవత్సరాల క్రితం హుందాగా వున్న ఒక పెద్దాయన 'పల్లెసృజన' కార్యాలయానికి వచ్చి "నేనూ ఒక కార్యకర్తగా పని చేస్తాను" అని మాట ఇచ్చారు. నిజానికి 70 యేళ్ళు పైబడిన వ్యక్తి అలా వచ్చి చెప్పవలసిన అవసరం లేదు. కాకపోతే దేశంమీద వున్న ప్రేమ, ప్రజలకు మంచి చేద్దాము అనే తాపత్రయం, తనచుట్టూ వున్న జనులలో మంచికోసం మార్పు తేవాలి అని ప్రగాఢమైన కోరిక ఆయన్ను ఆరోజు 'పల్లెసృజన' కార్యాలయానికి వచ్చేలా చేశాయి. మాటల సందర్భంలో తెలిసింది ఆయనే ఆచార్య 'ఘుగ్' గారని. తన ఆలోచనలను కార్యరూపంలో పెట్టడానికి 'పల్లెసృజన' చక్కని మాధ్యమంగా కన్పించింది అన్నారాయన. అప్పటినుండి పల్లెసృజనలో మా అందరికీ మంచి ప్రోత్సాహకారి అయ్యారాయన. హైదరాబాదు, దాని చుట్ట ప్రక్కల వున్న అనేక విద్యా సంస్థలతో 'పల్లెసృజన'ను అనుసంధానం చేయటంలో ఆయన చాలా చొరవ చూపారు. చాలా ఇంజనీరింగ్ కళాశాలలలో మొదటి సంవత్సరం విద్యార్థులకి రెండు ప్రత్యేకమైన పాఠ్యాంశాలుగా 'పల్లెసృజన' కార్యక్రమాలను చేర్చడంలో ప్రధాన భూమిక పోషించాడు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'పల్లెసృజన' కార్యాలయానికి వచ్చి, గ్రామీణ స్థాయి ఇన్నోవేషన్లను గురించి కూలంకషంగా చర్చించి, ఏం చేస్తే బావుంటుంది? అన్న నిర్ణయాలు చేయటంలో క్రియాశీలక పాత్ర పోషించేవారు. ఆయన సమక్షంలో ఇతరులకి ఉత్సాహము, ఆనందము, ప్రేరణ కలిగేవి. తన ఆలోచనలను స్పష్టంగా, వివరంగా చెప్పడం ఆయన ప్రత్యేకత. 'పల్లెసృజన' వాలంటీర్లు, ఇన్నోవేటర్లు, కలిసి పనిచేసే వారు, అభిమానులకు సలహా, సంప్రదింపులకి ఆయన ఎప్పుడూ అందుబాటులో ఉండేవారు.

ప్రియమైన ఆచార్య 'ఘుగ్' గారూ, ఇకపై శుక్ర వారాలలో మీరు లేని లోటు భరించరానిదిగా కనిపిస్తుంది. మీ ఆత్మకు శాంతి చేకూరాలని మేము భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

'పల్లెసృజన' తన కార్యక్రమాలను మీరు కోరుకున్న విధంగా, ఇంకా విస్తృతంగా నిర్వహించటానికి మీ చల్లని ఆశీస్సులు కోరుకుంటూ.......

– 'పల్లెసృజన' కుటుంబం


PALLE SRUJANA Telugu Bi-monthly May - June 2019 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే












**పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.**

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,600/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- | 4,000/- |

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904